


చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## బుడమేరు వద్ద సీసీ వాల్ పూర్తి

- రికార్డ్ సమయంలో ముంపు నివారణ పనులు
- మే లో టెండర్లు, సీజన్‌కు ముందే పూర్తి
- మంత్రి నిమ్మల వెల్లడి

7





## అమెరికాలో సిలికాన్ వ్యాలీ

# అమరావతిలో క్వాంటం వ్యాలీ

- 2026 జనవరి 1నాటికి అమరావతిలో వ్యాలీ పార్క్ ఏర్పాటు
- క్వాంటం వ్యాలీకి అనుబంధంగా ఒక ఎకోసిస్టం తీసుకొస్తాం
- డీప్ టెక్నాలజీ, ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు విస్తృత అవకాశాలు
- బహుళజాతి సంస్థలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- సాంకేతికతను పాలన, ప్రజా జీవనంలో సమ్మిళితం చేయటమే లక్ష్యం
- అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- నేషనల్ వర్క్‌షాప్‌లో క్వాంటం కంప్యూటర్ ప్రోటోటైప్ ప్రదర్శన

2

## అమరావతి సిగన అధునాతన సాంకేతికత!

- వరల్డ్ క్వాంటమ్ టెక్నాలజీకి 'అమరావతి' లైట్‌హౌస్ కానుందా?
- ఉత్సాహంగా అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్‌షాప్
- 9 జాతీయ మిషన్లలో క్వాంటమ్ విప్లవం ఒకటన్న జితేంద్ర సింగ్
- వర్చువల్‌గా హాజరైన కేంద్ర శాస్త్ర సాంకేతిక సహాయ మంత్రి

3

## ఇదే కదా నేను కోరుకున్న మార్పు

- ప్రభుత్వ బడుల ముందు నో అడ్మిషన్ బోర్డులతో సంతృప్తి
- వాసుదేవరావు మాస్టార్ అభినందనీయులు
- తన పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చదివిస్తున్నారు
- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్

4





## దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా అమరావతి

- అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ ఉద్ఘాటన
- వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యం
- 50కి పైగా యూనికార్న్‌ల అభివృద్ధి
- చంద్రబాబు సాంకేతిక విప్లవంలో సెకెండ్ చాప్టర్ క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ
- అమరావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న మంత్రి

4

## అందరం కలిసి గొప్ప భవిష్యత్‌ను ఆవిష్కరిద్దాం

- క్వాంటం వర్క్‌షాప్‌కు వచ్చిన ప్రముఖులకు మంత్రి లోకేష్ పిలుపు

4

## రసాయన పరిశ్రమలో పేలుడుపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

- మృతి చెందిన 12 మంది కుటుంబాలకు సానుభూతి
- ఏపీకి చెందిన ఇద్దరికి తీవ్రగాయాలపై ఆందోళన
- మెరుగైన చికిత్స అందించాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి

5

## పొగాకు మొత్తం కొనుగోలు చేస్తాం

- సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి
- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోళ్లు దేశంలోనే తొలిసారి
- మామిడి, వరి, కోకో, మిర్చి రైతులకు అండగా ప్రభుత్వం
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టీకరణ
- బాపట్ల జిల్లాలో మరో మూడు పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

7

## ఏడాది పాలనలో ఎన్నో విజయాలు

- జగన్ పాలనలో అధోగతిలో వ్యవసాయం
- కూటమి పాలనలో విప్లవాత్మక మార్పులతో అభివృద్ధి
- రైతులకు అండగా సీఎం చంద్రబాబు
- సంక్షేమంలోనూ మెరుగైన పథకాలు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి

8

# అమెరికాలో సిలికాన్ వ్యాలీ అమరావతిలో క్వాంటం వ్యాలీ

- 2026 జనవరి 1నాటికి అమరావతిలో వ్యాలీ పార్క్ ఏర్పాటు
- క్వాంటం వ్యాలీకి అనుబంధంగా ఒక ఎకోసిస్టం తీసుకొస్తాం
- డీప్ టెక్నాలజీ, ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు విస్తృత అవకాశాలు
- బహుళజాతి సంస్థలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- సాంకేతికతను పాలన, ప్రజా జీవనంలో సమ్మిళితం చేయటమే లక్ష్యం
- అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్ షాప్‌లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- నేషనల్ వర్క్ షాప్‌లో క్వాంటం కంప్యూటర్ ప్రోటోటైప్ ప్రదర్శన



విజయవాడ (చైతన్య రథం): అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 2026 జనవరి 1నాటికి క్వాంటం వ్యాలీ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో క్వాంటం వ్యాలీ పార్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీపై ఏర్పాటు చేసిన నేషనల్ వర్క్ షాప్‌నకు సీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజయవాడలో నిర్వహించిన నేషనల్ వర్క్ షాప్‌నకు ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణరంగాలకు చెందిన ప్రముఖ బహుళ జాతి సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు వివరించారు. క్వాంటం కంప్యూటింగ్‌ను భారత్ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వర్క్ షాప్‌లో సీఎం మాట్లాడుతూ “నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఐటీ పరిశ్రమ విస్తరిస్తోంది. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను కలిసి ఐటీ విస్తరణపై చర్చించా. పీపీపీ విధానంలో హైటెక్ సిటీ కట్టాలని ఎల్ అండ్ టీని కోరాను. తర్వాత ఆ సంస్థ బెంగుళూరు, గురుగాంవ్‌లోనూ ఐటీ భవనాలు కట్టింది. భవిష్యత్‌లో భారత్ అతిపెద్ద ఐటీ హబ్‌గా మారుతుందని అప్పుడే చెప్పాను. ఉమ్మడి ఏపీలో ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాను. రాజధాని అమరావతికి అనేక ఐటీ సంస్థలు వస్తున్నాయి. అధునాతన సాంకేతిక కేంద్రంగా అమరావతిని మారుస్తాం. అమరావతికి రావాలని స్టార్టప్ కంపెనీలను ఆహ్వానిస్తున్నాం” అని సీఎం చంద్రబాబు వివరించారు.

## 2026 జనవరికి అమరావతిలో క్వాంటం వ్యాలీ

నేషనల్ క్వాంటం మిషన్‌ను కేంద్రం ప్రకటించిన వెంటనే అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీలాంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. “క్వాంటం వ్యాలీ పార్క్‌కు అనుబంధంగా పూర్తిస్థాయి ఎకో సిస్టమ్ ఏర్పాటు చేసి, వందకు పైగా యూజ్ కేసెస్‌ను పరీక్షిస్తాం. ఓ మిషన్ తీసుకువచ్చి అమరావతికి క్వాంటం కంప్యూటర్ వచ్చేసింది అనుకోవటం లేదు. వివిధ ఉపకరణాల నుంచి రియల్-టైమ్ డేటా విశ్లేషణకు, వ్యవసాయంలో మట్టి తేమవంటి అంశాలను పర్యవేక్షించడానికి క్వాంటం కంప్యూటింగ్ అవసరం. క్వాంటం టెక్నాలజీ, డీప్ టెక్నాలజీ, ఏఐలు ఇప్పుడు సరికొత్త సాంకేతిక విప్లవం. ఈ రంగాల్లో ఏపీకి కొన్ని సానుకూలతలున్నాయి. ఏపీలో స్పేస్ సిటీ, స్పేస్ టెక్నాలజీ, డిఫెన్స్, ఎరో స్పేస్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో చాలా అవకాశాలు ఉన్నాయి. ఏపీలో ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15నుంచి వందశాతం పౌరసేవలు వాట్సాప్ ద్వారానే అందిస్తాం. డేటా లేక్‌పై ఏపీ ప్రస్తుతం పనిచేస్తోంది. పౌరుల నివాసాలు జియో ట్యాగింగ్, సర్వీస్ డెలివరీ, ఆన్ లైన్ ఫైల్స్, క్లౌడ్ డేటాలను పాలనలో వినియోగిస్తున్నాం. సీసీ కెమెరాలు, సెన్సార్లు, వేరబుల్స్ ద్వారా రియల్ టైమ్ డేటా వస్తోంది. వీటిని విశ్లేషించాలంటే క్వాంటం కంప్యూటింగ్ అవసరం. వ్యవసాయ రంగంలో భూమిలో తేమ, ఎరువుల వినియోగంలాంటి అంశాలను కూడా క్వాంటం కంప్యూటింగ్‌తో అనుసంధానిస్తే అద్భుతాలు చేయొచ్చు. క్వాంటం టెక్నాలజీలో స్టార్టప్‌లు కూడా వస్తే అవకాశాలు విస్తృతమవుతాయి. ఫార్మా రంగంలోనూ, వ్యక్తుల ఔషధ వినియోగంవంటి వాటిపైనా పరిశోధనలు సాగించవచ్చు. క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతను మరోస్థాయికి చేరుస్తుంది” అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

## క్వాంటం టెక్నాలజీలో పెట్టుబడులు, స్టార్టప్‌లకు ఆహ్వానం


క్వాంటం రంగంలో స్టార్టప్‌లు రావడానికి విస్తృత అవకాశాలున్నాయని, ఆవిష్కరణకు ఆకాశమే హద్దని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలు, స్టార్టప్‌లకు సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ “ఈ మూమెంటంలో బహుళజాతి కంపెనీలు భాగస్వాములు కావాలి. ఇప్పుడే పెట్టుబడులతో ముందుకు రావాల్సిన అవసరముంది. భారత్‌లోనే ఉత్పత్తులు తయారు చేసి ఇక్కడి మార్కెట్‌ను వినియోగించుకోవాలి. ఏపీలోనూ వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. పాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం తీసుకురావడానికి ఐటీ ఒక్కటే మార్గమని బలంగా విశ్వసించాను. హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించడం ద్వారా ఒక బలమైన ఐటీ ఎకోసిస్టమ్‌ను సృష్టించాం. ఫలితంగా ఇప్పుడు సైబరాబాద్ ప్రపంచ ఐటీ కేంద్రంగా మారిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి మార్గనిర్దేశనం చేయాలి” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## క్వాంటం టెక్నాలజీ విజన్ లక్ష్యాలను మంత్రి లోకేష్ సాధించాలి

కార్నెగీ మెలన్ యూనివర్సిటీలో చదువుకున్న నారా లోకేష్ ఐటీ మంత్రిగా ఉండటం సంతోషదాయకమని, గతంలో ఈ శాఖను గ్రాడ్యుయేషన్ చదువుకున్నవారు నిర్వర్తించారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. లోకేష్‌కు క్వాంటం వ్యాలీ ద్వారా ఒక విజన్ లక్ష్యాలను సాధించే బాధ్యతను అప్పగించానని ముఖ్యమంత్రి తెలిపారు. తాను నిత్య విద్యార్థినని, భవిష్యత్ టెక్నాలజీని పాలనకు, అభివృద్ధికి ఎలా సమ్మిళితం చేయాలన్నదే తన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వం సహకారంతో సాధిస్తామని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ప్రోటోటైప్‌ను ఐబీఎం నేషనల్ వర్క్ షాప్‌లో ప్రదర్శించింది. నేషనల్ వర్క్ షాప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్వాంటం టెక్నాలజీ స్టార్టప్‌లను మంత్రి లోకేష్‌తో కలిసి సీఎం పరిశీలించారు.








# అమరావతి సిగన అధునాతన సాంకేతికత!

- 2026 జనవరి 1నాటికే అమరావతిలో వ్యాలీ పార్క్ ఏర్పాటు
- భవిష్యత్‌లో దేశానికే వెన్నుముక కానుందన్న ఆకాంక్షలు
- వరల్డ్ క్యాంటమ్ టెక్నాలజీకి ‘అమరావతి’ లైట్‌హౌస్ కానుందా?
- ఉత్సాహంగా అమరావతి క్యాంటం వ్యాలీ నేషనల్ వర్క్ షాప్
- హాజరైన ఐటీ దిగ్గజ కంపెనీల యజమానులు, ప్రతినిధులు
- 9 జాతీయ మిషన్లలో క్యాంటమ్ విప్లవం ఒకటన్న జితేంద్ర సింగ్
- వర్చ్యువల్‌గా హాజరైన కేంద్ర శాస్త్ర సాంకేతిక సహాయ మంత్రి
- ఏపీ యువతకు ఉజ్వల భవిష్యత్ అంటూ ప్రశంసలు





అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్యాంటమ్ వ్యాలీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తోంది. అందులో భాగంగా సోమవారం నోవాటెల్ హోటల్‌లో అమరావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్ షాపు -2025ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. దేశ విదేశాలనుంచి ఐటీ నిపుణులు, ఐటీ సంస్థల అధినేతలు హాజరైన వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు, విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్‌లు ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశాలు, ఆకాంక్షలను వివరించారు. అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్కు షాప్‌లో ‘ఎన్విసైజింగ్ అమరావతి యాజ్ ఏ గ్లోబల్ క్యాపిటల్ ఫర్ క్యాంటమ్ టెక్నాలజీస్’ అనే అంశంపై మేధోమధన సదస్సు జరిగింది. సదస్సుకు హాజరైన దిగ్గజ ఐటి కంపెనీ ప్రతినిధుల సమక్షంలో.. దేశంలోనే తొలిసారిగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో క్వాంటం వ్యాలీ పార్కును అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.ఈ వర్క్ షాప్‌కు టీసీఎస్ ప్రెసిడెంట్ అండ్ గ్లోబల్ హెడ్ వి రాజన్న, మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ రాజీవ్‌కుమార్, ఎల్ అండ్ టీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సిద్ధు, వార్నర్ బ్రదర్స్ ఇండియా ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ మనీష్ వర్మ, భారత్ బయోటెక్ వ్యవస్థాపకురాలు సుచిత్రా కె ఎల్లా, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జెబివి రెడ్డి, రెడ్డీ ల్యాబ్స్ ఫణి మిత్ర,అస్ట్రా జెన్కా ఎండీ ప్రవీణ్ రావు, ఐబీఎం ఇండియా వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ అజయ్‌కుమార్ సూద్‌లతో పాటు అమెజాన్, హెచ్‌సీఎల్, ఎల్ అండ్ టీ, ఐఐటీ మద్రాస్, తిరుపతి, బ్యాంక్ ఆఫ్ అమెరికావంటి సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

వివిధ బహుళ జాతి ఐటీ కంపెనీలు, విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సాంకేతికతలో వస్తున్న అత్యాధునిక విషయాలను అడిగి తెలుసుకోవడంతోపాటు స్టాల్స్‌లో నూతన ఆవిష్కరణలపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాపులో ఫార్మా, వాణిజ్య రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులున్నారు. దేశంలోని తొలిసారిగా ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో అమరావతిలో క్యాంటమ్ వ్యాలీ కార్యకలాపాలు జనవరి నుంచి ప్రారంభిస్తామని ఐటీ సెక్రటరీ వెల్లడించారు.

వీడియో కాన్ఫరెన్సు ద్వారా అమరావతి క్యాంటమ్ వ్యాలీ నేషనల్ వర్క్ షాప్‌నకు కేంద్ర శాస్త్ర సాంకేతిక సహాయ మంత్రి జితేంద్ర సింగ్ హాజరై మాట్లాడుతూ 9 జాతీయ మిషన్లలో క్యాంటమ్ టెక్నాలజీ విప్లవం ఒకటని, అందుకే నేషనల్ క్యాంటమ్ మిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. దేశంలోని నాలుగు ప్రాంతాల్లో క్యాంటమ్ పరిశోధనా కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. 17 రాష్ట్రాల్లో 152 సంస్థలు ఈ క్యాంటమ్ సాంకేతికతపై పనిచేస్తున్నాయన్నారు. ఏఐసీసీటీఈ ద్వారా బీటెక్ క్యాంటమ్ టెక్నాలజీలో అందిస్తున్నామన్నారు. నేషనల్ క్యాంటమ్ మిషన్ డిజిటల్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలను పర్యవేక్షిస్తోందన్నారు. టెక్నాలజీ ఇండియాను సాధించటంలో క్యాంటమ్ వ్యాలీ కూడా భాగస్వామి అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీతో రాష్ట్రంలో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ దేశానికే వెన్నుముఖగా నిలుస్తుందన్నారు.

ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ అమరావతి డ్రాఫ్ట్ డిక్లరేషన్‌ను ఈ సందర్భంగా ప్రకటించారు. అమరావతి క్యాంటమ్ డిక్లరేషన్ పీఠికను చదివి వినిపించారు. జనవరి 1, 2026న అమరావతిలో క్యాంటమ్ సిష్టంను సౌత్ ఏషియాలోనే మొదటిగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐబీఎం క్యాంటమ్ సిస్టం ఏర్పాటు చేసేనాటికే 100 అల్గారిథమ్‌లను సిద్ధం చేస్తామన్నారు. వచ్చేఏడాది అమరావతి క్యాంటమ్ అకాడమీని ప్రారంభించి 500మందికి ట్రైనింగ్ కూడా అందిస్తామన్నారు. రూ.1,000 కోట్ల స్టార్టప్ క్యాంటమ్ కంపెనీలకు అందుబాటులో ఉంచేలాచర్యలు తీసుకుంటామన్నారు. క్యాంటమ్ టెక్నాలజీ ద్వారా చిప్‌లు, హార్డ్‌వేర్‌తో పాటు అన్ని రంగాలను కవర్ చేయాలని భావిస్తున్నామన్నారు. ప్రపంచంలోని ఈ రంగంలోని నిపుణులు అందరూ ఇక్కడికిరావాలి.వారితోకలిసి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. 2035నాటికి కేవలం ఇండియా క్యాంటమ్ టెక్నాలజీకే కాదు వరల్డ్ క్యాంటమ్ టెక్నాలజీకి లైట్‌హౌస్ అవుతుందన్నారు. అమరావతిలో టెక్‌వ్యాలీ పార్కులోనే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఇతర రాష్ట్రాల సేవలు వినియోగించుకునే వెసులుబాటు ఉందన్నారు. అమరావతిలో 50 ఎకరాల్లో ఏర్పాటుకానున్న క్యాంటమ్ వ్యాలీకి రూ.4 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వ అంచనా అని కాటమనేని భాస్కర్ తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రముఖులు క్యాంటమ్ వ్యాలీ సదస్సులో మాట్లాడారు.



# దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా అమరావతి

- అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ ఉద్ఘాటన
- వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యం
- 50కి పైగా యూనికార్న్‌ల అభివృద్ధి
- చంద్రబాబు సాంకేతిక విప్లవంలో సెకెండ్ చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ
- అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్‌లో పాల్గొన్న మంత్రి




అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అని, ప్రజారాజధాని అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. విజయవాడలోని నోవాటెల్ హొటల్‌లో సోమవారం నిర్వహించిన అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ వర్క్ షాప్‌నకు హాజరైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, విద్యారంగ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, ఇతర అధికారులకు స్వాగతం పలుకుతున్నా నన్నారు. అమరావతి వర్క్ షాప్-2025కు మిమ్మల్ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. ఈ సమావేశం దేశంలో అత్యుత్తమ క్వాంటమ్ మేధావుల సమావేశం మాత్రమే కాదు. దేశంలో ఓ కీలక మలుపు కానుంది. భవిష్యత్‌లో రాబోయే సాంకేతిక విప్లవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నారనే సంకేతాన్ని ఇస్తోందని మంత్రి లోకేష్ అన్నారు.

## జాతీయ క్వాంటమ్ మిషన్‌కు అనుసంధానంగా..

అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మార్చాలనేది మా లక్ష్యం. ఇక్కడ ఆలోచనలు ఆవిష్కరణలుగా, ఆవిష్కరణలు పరిశ్రమలుగా మారేలా ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం. ఇది ఒకరోజు కార్యక్రమం కాదు. ఇది దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఉద్యమం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా నిలవబోతోంది. క్యూబిట్ ఆర్కిటెక్చర్ నుంచి క్రయో ఎలక్ట్రానిక్స్ వరకు,ఆల్గోరిథం అభివృద్ధి నుంచి అంతర్జాతీయ క్వాంటమ్ ప్రమాణాల వరకు మేం పూర్తిస్థాయిలో క్వాంటమ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తాం. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన 156 క్యూబిట్లను కలిగిన ఐబీఎం క్యాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అమరావతిలో అందుబాటులోకి రానుంది. ఇది చాలా గర్వించదగ్గ విషయం. ఆసియాలో మొట్టమొదటి క్వాంటమ్ ప్రమాణాల టెస్ట్‌బెడ్‌ను ఎన్పీఎల్, ఐఈఈఈ, సీయాక్, ఏడబ్ల్యూఎస్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేస్తాం. ఐబీఎం, టీసీఎస్, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్ర వంటి అగ్రగామి సంస్థల సహకారంతో క్యాంటమ్ స్టారప్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తాం. ఈ కార్యాచరణకు వ్యూహాత్మక దూరదృష్టి ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన జాతీయ క్వాంటమ్ మిషన్‌కు అనుసంధానంగా, గ్లోబల్ భాగస్వామ్యాలతో క్వాంటమ్ వ్యాలీ నిర్మిస్తాం. ఐఐటీలు, ఐఐఎస్, టోక్యో యూనివర్సిటీల సహకారం తీసుకుంటామని మంత్రి లోకేష్ తెలిపారు.

## ప్రపంచ పటంలో చోటు దక్కేలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. చంద్రబాబు మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు నేను ఏడో తరగతి చదువుతున్నాను. దక్షిణాసియా క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుంది. సాఫ్ట్‌వేర్ రంగానికి సిలికాన్ వ్యాలీ ఎలాగో.. అమరావతిలో క్యాంటమ్ వ్యాలీ అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ సాధనకు అనుగుణంగా పనిచేస్తూ ప్రపంచపటంలో అమరావతి క్యాంటమ్‌కు చోటు దక్కేలా కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

## ఏపీ బ్రెయిన్ క్యాపిటల్‌గా మారుతుంది

ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. విజన్ అంటే ఇప్పుడు వెలా సిటీ, ఇన్నోవేషన్. గ్లోబల్ రేస్‌లో చేరడం కాదు.. మనమే దారి చూపాలి. ఫలితంగా ఏపీ బ్రెయిన్ క్యాపిటల్‌గా మారుతుంది. క్వాంటమ్ సైన్స్‌ను ఇంజనీరింగ్ లోనూ భాగం చేస్తున్నాం. అమరావతిని క్యాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా మారుస్తాం. ఇన్నోవేటివ్, స్టార్టప్‌లకు ఈ క్యాంటమ్ వ్యాలీ పార్క్ ఓ లాంచ్ ప్యాడ్ అవుతుందని మంత్రి లోకేష్ చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రోడర్, టీసీఎస్ టెక్నాలజీ, స్టాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న,ఎల్ అండ్ టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, అడ్వైజర్ ఎంవీ సతీష్, ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కే.మధుమూర్తి, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోఠి, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# అందరం కలిసి గొప్ప భవిష్యత్‌ను ఆవిష్కరిద్దాం

**- క్వాంటం వర్క్‌షాప్‌కు వచ్చిన ప్రముఖులకు మంత్రి లోకేష్ పిలుపు**



అమరావతి (చైతన్యరథం): క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ జాతీయ వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులకు విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో, అమరావతిని క్వాంటం టెక్నాలజీలకు ప్రపంచ కేంద్రంగా మార్చడానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం ఆవిష్కరణల్లో ముందంజలో ఉంచేందుకు ఈ సమావేశం గొప్ప ముందడుగా అభివర్ణించారు. అందరం కలిసి కట్టుగా భవిష్యత్తును రూపొందిద్దామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.

# ఇదే కదా నేను కోరుకున్న మార్పు

- ప్రభుత్వ బడుల ముందు నో అడ్మిషన్ బోర్డులతో సంతృప్తి
- తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్న వాసుదేవరావు మాస్టార్ అభినందనీయులు
- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు చూస్తుంటే ఇదే కదా తాను కోరుకున్న మార్పు అనిపిస్తోందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ సంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయాలకు దూరంగా, సమగ్ర విద్యకు దగ్గరగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి, సమస్యలను పరిష్కరించి విద్యాలయాలుగా పాఠశాలలను తీర్చిదిద్దిన కష్టం .. శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గం డోలపేటకు చెందిన టీచర్ డోల వాసుదేవరావు లాంటి వారిని చూసి మర్చిపోతామన్నారు. ఈ మాస్టారు తన పిల్లలు ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారని మెచ్చుకున్నారు. ఒక మాస్టారే తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తుంటే, మనం ఎందుకు చదివించకూడదు అని ప్రజల్లో ఆలోచన రేకెత్తించిన వాసు మాస్టర్‌కి అభినందనలు తెలుపుతున్నానన్నారు. మన బడికి మనమే అంబాసిడర్లుగా నిలుద్దాం. అంతా కలిసి దేశానికే దిక్సూచిగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తీసుకొద్దామని మంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారు.



- మృతి చెందిన 12 మంది కుటుంబాలకు సానుభూతి
- ఏపీకి చెందిన ఇద్దరికి తీవ్రగాయాలపై ఆందోళన
- మెరుగైన చికిత్స అందించాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి

## రసాయన పరిశ్రమలో పేలుడుపై

# మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

అమరావతి (చైతన్యరథం): తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో 12 మంది మృతి చెందటంపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడిన వార్త ఆందోళనకు గురిచేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. సంఘటనా స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా.. మరో ఏడుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. భవనం శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ ఘటనపై ప్రధాని మోదీతోపాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు.. ఈ పరిశ్రమ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది.







### వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం

సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు.

# వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం!

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ఇంటింటికి తీసుకెళ్లేందుకు తెలుగుదేశం కార్యాచరణ సిద్ధం చేసింది. సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట జూలై 2నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లనున్నారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలు.. అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నెల ప్రణాళికను సీఎం చంద్రబాబు శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ఎన్నికల ముందు సూపర్ 6 మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ గురించి ప్రతి గడపనా ప్రచారం చెయ్యాలని చంద్రబాబు ఆదేశించారు. ఇదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తామంని, రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో పేరిట ఐదు వారాలపాటు ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమం చేపడుతున్నాడు జగన్‌రెడ్డి. అబద్ధాలు, తప్పుడు లెక్కలతో జనంలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. ఐదేళ్లపాటు రాష్ట్ర విధ్వంసానికి పాల్పడిన జగన్‌రెడ్డే.. రాష్ట్రాన్ని వికాసంవైపు నడిపిస్తోన్న కూటమిని నిలదీస్తాననడం హాస్యాస్పదమే. -ఏపీని అన్ని రంగాలలో కటిక చీకట్లకు నెట్టిన చరిత్ర జగన్‌రెడ్డిది. అయినా తానేదో రాష్ట్రం కోసం జీవితాన్ని ధారపోశానన్న బిల్డప్‌తో.. నక్క వినయాలు ప్రదర్శిస్తూ రాష్ట్ర ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని ప్రయత్నించడం జగన్‌కే చెల్లు!



శవాల గుట్టలమీదుగా, అబద్ధాల మెట్లమీదుగా మరోసారి సింహాసనం అధిష్టించాలని అర్రులు చాస్తున్నాడు జగన్. ఐదేళ్ల పాలనాకాలంలో జగన్ సాధించిన ఘనత ప్రజలకు తెలిదనుకోవడం అతని భ్రమ! విద్యుత్ ఛార్జీలతో నడ్డి విరిచాడు. నిత్యావసరాల ధరలు ఆకాశంలోవున్నా నిర్లక్ష్యం చూపాడు. చెత్త పన్నుతో వేధించాడు. ఆర్టీసీ ఛార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలకు వాతలు పెట్టాడు. ఏటా ఆస్తిపన్నులు పెంచాడు. ఉచిత ఇసుక విధానం ఎత్తివేసి భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టాడు. పేదలకిచ్చే కిలో కందిపప్పులో కోత పెట్టాడు. మద్యం ధరల్ని ఆకాశానికి చేర్చాడు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు. ఇన్ని చేసిన జగన్.. ఇప్పుడు ఇంటింటికెళ్లి తాను చేసిన మేళ్లు చెబుతాననడం హాస్యాస్పదం. జగన్ సాగించిన దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమాలు, దమనకాండల గురించి ప్రజలకు ఏమని చెప్తాడు? ఐదేళ్లపాటు అరాచక పాలనతో రాష్ట్రం నడ్డి విరిచిన జగన్.. రాష్ట్రాన్ని ఉద్ధరించానని పచ్చి అబద్ధాలు చెప్పుకోవడం సిగ్గుచేటు. జగన్ చేసిన అభివృద్ధిని చూసే రాష్ట్ర ప్రజలు 11సీట్ల ఫలితాలిచ్చారు. ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఏదోక దోపిడీకి గురయ్యారన్నది బహిరంగ వాస్తవం. ప్రజలకు సరైన ఆదాయం లేకుండా చేసి.. ప్రభుత్వం భిక్షమెప్పుడు వేస్తుందా? అన్నంత భయానక పరిస్థితికి తెచ్చిందే జగన్. వివిధ వర్గాల ప్రజలపై పన్నులు, ఛార్జీల రూపంలో వేసిన భారంతోపాటు, రేషన్ కోతల ద్వారా వినియోగదారులపై పడిన భారం కలిపితే రూ.1.5 లక్షల కోట్లు. అందులో అధికశాతం బాధితులు నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే.

2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు సూచించారు. దీంతో కూటమి శ్రేణులు నెలపాటు పూర్తిగా ప్రజల్లోనే ఉండనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్న విషయాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. ప్రధానంగా పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత ఇసుక విధానం, తల్లికి వందనం అమలు చేశారు. అన్నదాతా సుఖీభవ ప్రణాళిక సిద్ధం చేశారు. దీపం-2 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మైదాన, గిరిజన ప్రాంతాల్లో బీటీ, సీసీ రహదారులు, గోశాలల నిర్మాణం, గిరిశిఖర గ్రామాల్లో కంటైనర్ ఆసుపత్రుల ఏర్పాటువంటి విషయాలన్నింటినీ కూటమి నేతలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను సమర్థ నాయకత్వమే అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలపనుంది. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లోనూ నిర్దుష్ట లక్ష్యాలు నిర్దేశించుకొని.. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాభివృద్ధికి బలమైన పునాదులు వేస్తోంది కూటమి సర్కారు. అలాంటి కూటమిపై బురదచల్లి బదనాం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి వస్తున్న కుట్రదారుడి బండారాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలే బయటపెట్టాల. అసమర్థుడే పాలకుడైతే.. గత ప్రభుత్వకాలంలో ఎలాంటి పరిణామాలు సంభవించాయి.. రాష్ట్రానికి ఎంతటి నష్టం వాటిల్లిందో ప్రజలకు వివరించాలి. పార్టీ యంత్రాంగమంతా నెలపాటు ప్రతి ఇంటి తలుపు తట్టాలి. కూటమి ప్రభుత్వ విజయాలను, గత ప్రభుత్వ విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలి. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాటిలో నెరవేర్చిన హామీలు, నెరవేర్చబోతున్న హామీలు, చేసిన పనులను వివరిస్తూ విధ్వంసంనుంచి వికాసంవైపు వేస్తోన్న అడుగులను ప్రజల మెదళ్లకు చేర్చాలి. గత ప్రభుత్వ అరాచకాన్ని, విధ్వంసాన్ని కళ్లకు కట్టాలి. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రధానం. చేసిన పనులను పదేపదే చెప్పడం, చేయకపోతే ఎందుకూ కారణాలను వివరించడమే పార్టీ శ్రేణులు నిర్వర్తించాల్సిన బాధ్యత.



జగన్‌రెడ్డి పాలనలో ఆస్తులన్నీ తాకట్టుపెట్టారు. ప్రజాభవనాలన్నీ పరాధీనమైపోయాయి. పార్కులు, పాఠశాలలు, బస్టాండులు ప్రకృతి వనరులు.. ఒకటేమిటి పంచభూతాలూ బందీలయ్యాయి. రోజు గడవని ఆర్థిక పరిస్థితి తెచ్చి ఏపీని దివాళా అంచుకు ఈడ్చిన జగన్‌రెడ్డి, తానేదో ఘనకార్యం సాధించినట్టు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలపట్ల కూటమికి జాగరూకత అవసరం. జగన్ సృష్టించిన పెను విధ్వంసానికి యావత్ ఆంధ్ర విలవిల్లాడింది. మరోసారి బూటకపు కబుర్లతో ప్రజలను బురిడీ కొట్టించకముందే.. కూటమి నేతలు ప్రజల్లోకి వెళ్లాలి. ఏడాది పాలనలో సాధించిన విజయాలను ఏకరువు పెట్టడమే కాదు, ఏపీకి వినాశకారిగా పరిణమించిన జగన్మోహన్‌రెడ్డి వికృతాన్నీ ప్రజలకు వివరించాలి. వికాసానికి, విధ్వంసానికి మరోసారి జరుగుతున్న యుద్ధమే ఇది. ఈ యుద్ధంలో -అభివృద్ధి నిరోధక భూతాన్ని శాశ్వతంగా కట్టడి చేయడమే కూటమి ముందున్న సవాల్!

**- నీరుకొండ ప్రసాద్**

చైతన్యరథం

# బనకచర్ల.. ఏపీ గేమ్‌ఛేంజర్

- ఈ ప్రాజెక్టుతో కరవురహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- గోదావరి వరదలను నియంత్రించేందుకు అవకాశం
- వరదలతో ఏపీకి ఏటా రూ.2,000 వేల కోట్ల నష్టం
- ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు అతలాకుతలం
- ఏటా 3 వేల టీఎంసీ వరద జలాలు సముద్రం పాలు
- గోదావరి వృధా జలాల వినియోగానికి ఏపీ సర్కారు కసరత్తు
- 200 టీఎంసీ నీటిని సీమకు తరలించేలా బనకచర్ల ప్రాజెక్ట్
- ఈ ప్రాజెక్టుతో చివరి నేలలకూ సాగునీరు, ప్రతి ఇంటికి తాగునీరు
- వరద జలాల్లో వాటా కావాలంటూ తెలంగాణ పొంతనలేని వాదన
- వరద జలాలతో ఏటా నష్టపోతున్నది ఆంధ్రప్రదేశ్ మాత్రమే



గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తును మార్చి.. సంపద సృష్టించి.. ప్రజల తలసరి ఆదాయాన్ని గణనీయంగా పెంచే 'గేమ్ ఛేంజర్'. ఏటా సగటున 2,989 టీఎంసీ గోదావరి జలాలు సముద్రం పాలవుతున్నాయి. వాటిలో 200 టీఎంసీ జలాలను ఈ ప్రాజెక్టుకు సద్వినియోగించాల న్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ప్రాజెక్ట్ పూర్తయితే ప్రతి ఎకరాకూ నీళ్లివ్వొచ్చు. వరదలను నియంత్రించ వచ్చు. తాగునీటి అవసరాలకు, పరిశ్రమలకు పుష్కలంగా నీరు లభిస్తుంది. రూ.80,112 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును కేంద్రం సహకారంతో, ప్రైవేటు భాగస్వామ్యంతో 'హైబ్రిడ్ యాన్యుటీ' విధానంలో చేపడతారు. గోదావరి -బనకచర్ల అనుసంధానం పూర్తయితే బనకచర్ల... రాయల సీమకు గేట్ వే అవుతుంది. సీమ ఉద్యాన పంటల హబ్‌గా మారుతుంది. బొల్లాపల్లిలో 150 టీఎంసీ నీటిని నిల్వ చేసుకుంటే, రాయలసీమ, కృష్ణా డెల్టా ప్రాంతాలలో ఎక్కడికైనా తరలించవచ్చు. బనకచర్ల ద్వారా 80 లక్షల జనాభాకు తాగునీరు, 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 22.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, పరిశ్రమలకు 200 టీఎంసీ జలాలు అందించవచ్చు. ప్రాజెక్టు పూర్తయితే జీఎస్టీ, ఇతర రూపాల్లో ప్రభుత్వానికి మొదటి ఏడాది నుంచే ఆదాయం వస్తుంది. యాన్యుటీ చెల్లించడం ఇబ్బంది కాబోదు. 20-25 ఏళ్లలో మొత్తం చెల్లించేలా నిబంధనలు రూపొందిస్తోంది కూటమి ప్రభుత్వం.

## గోదావరి నీటి తరలింపు ఇలా

పోలవరం కుడి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 17,500 నుంచి 28 వేల క్యూసెక్కులకు పెంచు తారు. దానికి సమాంతరంగా తాడిపూడి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని ఇప్పుడున్న 1,400 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు పెంచుతారు. ఈ రెండు కాలువల ద్వారా వరద ప్రవాహముండే 100 రోజుల్లో రోజుకు 2 టీఎంసీ జలాలను ప్రకాశం బ్యారేజీకి తరలించడం లక్ష్యం. ప్రకాశం బ్యారేజీకి ఎగువున వైకుంఠపురం వద్ద నిర్మించే లిఫ్ట్ లేదా అక్విడక్ట్ ద్వారా నీటిని నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువలోకి మళ్లించి, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఈ రిజర్వాయర్‌ను మొదట 170 టీఎంసీ సామర్థ్యంతో నిర్మిస్తే, భవిష్యత్తులో 200-400 టీఎంసీ వరకు పెంచుకోవచ్చు. బొల్లాపల్లి నుంచి పలుచోట్ల లిఫ్టులు, రెండు సొరంగాలు నిర్మిస్తారు. బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు ఈ జలాలను తరలిస్తారు.

## బనకచర్ల ప్రాజెక్ట్‌తో కలిగే ప్రయోజనాలు

గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ నిర్మాణంతో ఏపీ సశ్యశ్యామలం అవుతుంది. ప్రధానంగా వ్యవసాయ రంగమే కాకుండా పారిశ్రామిక రంగం, వలసల నివారణ, ఉపాధి అవకాశాలు కల్పించడం, తాగునీటి ఎద్దడి నివారణకు ఊతమిచ్చేలా ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు రూపకల్పన చేశారు. సుమారు 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. 80 లక్షల మంది తాగునీటి అవసరాలు తీర్చవచ్చు. పరిశ్రమలకు కావాల్సిన నీటిని అందించే అవకాశముంటుంది. ఏపీలో కరవు అనేది లేకుండా చేయొచ్చు.

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం ఉండదు: సీఎం చంద్రబాబు

సముద్రంలోకి వృధాగా పోతున్న వరద నీటిని వినియోగించుకుంటామంటే అడ్డుచెప్పడంపై ఏపీ సీఎం చంద్రబాబు మండిపడ్డారు. గోదావరిలో నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయి. పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతిరాని ప్రాజెక్టులే ఉన్నాయి. కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదని, కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలని ఆయన సూచించారు. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. గోదావరి నీళ్లను రెండు రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం గోదావరి నదిపై ప్రారంభించిన ప్రాజెక్టులన్నీ నిర్మించుకోమని చెప్తున్నాం. వాళ్లు ప్రాజెక్టులు నిర్మించుకుంటే ఏపీ అడ్డుచెప్పదని స్పష్టం చేశాం. ఏపీ, తెలంగాణ.. రెండు రాష్ట్రాలూ అభివృద్ధి కావాలనేది టీడీపీ లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు.

## తెలంగాణలో అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి టీడీపీ శ్రీకారం

ఉమ్మడి రాష్ట్రంలో దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టులను టీడీపీ ప్రభుత్వమే నిర్మించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టను టీడీపీ పాలనలో (1983 - 1989)లోనే ఆధునీకరించి విస్తరణ పురోగతి సాధించింది. సింగూర్ డ్యామ్ కాల్వల ఆధునీకరణతో హైదరాబాద్‌కు మంజీరా నదీజలాలు తాగునీరుగా అందుతున్నాయంటే.. అది అప్పటి సీఎం చంద్రబాబు కృషి ఫలితమే. అలాగే నాగార్జునసాగర్ నుండి హైదరాబాద్‌కు నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి పైప్‌లైన్‌లు, పంపింగ్ స్టేషన్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ఆధునీకరణ చేసింది టీడీపీ ప్రభుత్వమే. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చే క్రమంలో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం కోసం నాగార్జునసాగర్ నీటిని సమర్థవంతంగా వినియోగించడంపై ఆనాడే సీఎం చంద్రబాబు దృష్టి సారించి, చర్యలు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో విపరీతమైన ఫ్లోరైడ్ సమస్యవుంటే ఆ జిల్లా కోసం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. ఏఎంఆర్ విజయవంతం కాగానే దేవాదుల చేపట్టింది. అటు మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై అక్రమంగా బాబ్లీ ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే అడ్డుకుంది, ఆందోళనకు దిగిందీ టీడీపీనే. ఇలా అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన టీడీపీ.. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంటుందంటూ విమర్శలకు దిగడం హాస్యాస్పదం.

## గోదావరి వరదలతో ఏటా రూ.2000 కోట్లు నష్టం

గోదావరి వరదల కారణంగా దిగువనున్న ఆంధ్రప్రదేశ్ ఏటా రూ.2000 కోట్లు నష్టపోతోంది. 2020లో భారీ వరదల కారణంగా రూ.8 వేల కోట్లకు పైగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం వాటిల్లింది. ఏటా 3 వేల టీఎంసీ వరద జలాలు వృధాగా గోదావరి నుంచి సముద్రంలో కలుస్తున్నాయి. వృధా జలాల నుంచి 200 టీఎంసీ నీటిని రాయలసీమకు బనకచర్ల ద్వారా తరలిస్తే కరవు ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు, సాగు విస్తరణా సాధ్యమవుతుంది. ఇలా దూరదృష్టితో తెలుగుతల్లికి జలహారతి పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రాజెక్ట్‌ను ఎగువనున్న తెలంగాణ వ్యతిరేస్తోంది. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ ప్రాజెక్ట్‌కు తెలంగాణ రాజకీయ పార్టీలు మోకాలడ్డుతున్నాయి. వృథాగా పోతున్న వరద జలాలను వినియోగించుకోవడంవల్ల ఎగువనున్న తెలంగాణకు ఎటువంటి నష్టం ఉండదు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో అక్కడి రాజకీయ పార్టీలు పీబీ లింక్ ప్రాజెక్ట్‌ను బూచిగా చూపించి విమర్శలు చేస్తూ... తీవ్ర రాద్ధాంతం చేస్తున్నాయి. గోదావరి బెసిన్‌లో 1486 టీఎంసీలో 968 టీఎంసీ తమవని తెలంగాణ వాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు 518 టీఎంసీ జలాలు ఆంధ్రప్రదేశ్ వినియోగించుకునేలా అవకాశాలున్నా.. తెలంగాణలో ఏటా 800 టీఎంసీ దాకా నీటి వినియోగం జరుగుతుంది. కానీ ఏపీలో 300 టీఎంసీ నీటిని కూడా వినియోగించుకునే పరిస్థితులు లేవు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా 194 టీఎంసీ వినియోగం మనకు అవకాశాలున్నాయి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం పనుల్లో ఎలాంటి పురోగతి లేక ఐదేళ్లపాటు ప్రాజెక్ట్ నిర్వీర్యమైంది. ఇప్పుడు ఈ జలాలు వినియోగించుకునే వీలు కూడా మనకు లేదు.

## వరద జలాల వినియోగంతో నష్ట నివారణకు చర్యలు

గోదావరి వరదలవల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఏటా భారీ నష్టం వాటిల్లుతోంది. వ్యవసాయ రంగంలో పంటలు ధ్వంసమవుతున్నాయి. వేల ఎకరాల ఉద్యానవన పంటలు దెబ్బతింటున్నాయి. వరదల వల్ల భూమి సారవంతం తగ్గి, రైతుల ఆదాయం కోల్పోతున్నారు. మౌలిక సదుపాయాలైన రహదారులు, వంతెనలు దెబ్బతింటున్నాయి. విద్యుత్ వ్యవస్థ, భవనాలువంటివి దెబ్బతింటున్నాయి. అనారోగ్యాలు, పశు పోషణ ఇబ్బందులు ఇలా అన్ని రంగాల్లో వందల కోట్లు ఏటా ఏపీ ప్రభుత్వం నష్టాన్ని చవిచూస్తుంది. 2024లో రూ.6,882 కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. ఇలా వృథాగా పోతున్న గోదావరి వరద జలాలను బనకచర్లకు తరలించడం ద్వారా వరద తీవ్రతను కొంతలో కొంతైనా నియంత్రించవచ్చు.

## వరద జలాలను వాడుకునే హక్కు ఏపీకి ఉంది

తెలంగాణ ప్రభుత్వం వారి ప్రాజెక్టులపైకంటే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్టుంది. వారి ప్రాజెక్టులను వదిలేసి ఏపీ ప్రాజెక్టులపై డిటైల్డ్ ప్రజెంటేషన్లు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నీటి పారుదల ప్రాజెక్టులపై ఎవరెంత రాజకీయం చేసినా రాజ్యాంగబద్ధంగా... వ్యవరించాల్సిన ప్రభుత్వాలు చివరికి నదీ జల వివాదాలపై ట్రిబ్యునల్ తీర్పులను ఖచ్చితంగా పాటించవలసిందే. కేవలం 200 టీఎంసీ నీటివినియోగంతో ఏపీ ప్రతిపాదించిన ప్రాజెక్టుపై గగ్గోలుపెట్టే బదులు ఈ క్రింది వాటిపై దృష్టి పెట్టండి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 1,486 టీఎంసీ గోదావరి నికర జలాలను ఇరు తెలుగు రాష్ట్రాలు వినియోగించుకోవాలి. బచావత్ ట్రిబ్యునల్ తీర్పులో క్లాజ్-4, క్లాజ్-7 ప్రకారం గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులకు లోబడి ఎక్కడికైనా తరలించి వాడుకోవడానికి ఏపీకి హక్కుంది. అలాగే గోదావరి నదికి చిట్ట చివర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్.. గోదావరి వరద లేదా మిగులు జలాలను వినియోగించుకునే వెసులుబాటును బచావత్ ట్రిబ్యునల్ కల్పించింది. ఏటా సగటున 3 వేల టీఎంసీ గోదావరి జలాలు బంగాళాఖాతంలో కలుస్తున్నాయని.. గోదావరి నదీ ప్రవాహానికి సంబంధించిన నివేదికలు చెబుతోంది. గత 50 ఏళ్ల గోదావరి వరద రికార్డులను చూస్తే ఏటా 3,100 టీఎంసీ నీరు సముద్రంలో వృథాగా కలిసినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

## కేంద్రానికి ఫీజిబిలిటీ నివేదిక

పోలవరం- బనకచర్ల అనుసంధానానికి ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి అన్ని కోణాల్లో అసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం అవసరమైన టర్మ్ ఆఫ్ రిఫరెన్సులను కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు చెందిన పర్వేష్ వెబ్‌సైట్‌లో నమోదు చేసింది. అలాగే కేంద్ర జలసంఘానికి ప్రీ ఫీజిబిలిటీ నివేదికను సమర్పించింది. ప్రీ ఫీజిబిలిటీ నివేదికను ఆమోదించిన తర్వాత ప్రాజెక్టు పూర్తిస్థాయి నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుతో రైతులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖ అధికారులు కేంద్రానికి వివరించారు. పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది.

## నదుల అనుసంధానంలో భాగమే బనకచర్ల ప్రాజెక్ట్

గోదావరి- బనకచర్ల ప్రాజెక్ట్ అనేది ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానంలో కీలక పాత్ర పోషిస్తుంది. సీఎం చంద్రబాబు రూపొందించిన విజన్ 2047లో నదుల అనుసంధానంతో రాష్ట్రంలో జరగబోయే అభివృద్ధి, భవిష్యత్ తరాలకు ఉపయోగాలను క్లుప్తంగా వివరించారు. అందులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్ట్‌కు ప్రణాళికలు రచించారు. ఈ ప్రాజెక్ట్‌తో ఆంధ్రప్రదేశ్‌ను కరవురహిత రాష్ట్రంగా మార్చడానికి వీలవుతుంది.

- ప్రవీణ్ బోయ
(అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్)

# పొగాకు మొత్తం కొనుగోలు చేస్తాం

- సీఎం చంద్రబాబు రైతుల పక్షపాతి
- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోళ్లు దేశంలోనే తొలిసారి
- మామిడి, వరి, కోకో, మిర్చి రైతులకు అండగా ప్రభుత్వం
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టీకరణ
- బాపట్ల జిల్లాలో మరో మూడు పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బాపట్ల (చైతన్యరథం): రైతుల వద్ద నుంచి చివరి ఆకు వరకు పొగాకును కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లాలో జె.పంగులూరు, పర్చూరు, ఇంకొల్లులో సోమవారం నాడు బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి మంత్రి గొట్టిపాటి మూడు పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకు వచ్చిన పొగాకు బేళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్రం ఆర్థికంగా కుదేలైనా రైతును అన్ని విధాలా ఆదుకుంటున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం వరి రైతులకు పెట్టిన రూ.1700 కోట్ల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం చంద్రబాబు చెల్లించారని మంత్రి గుర్తు చేశారు. పొగాకు రైతులకు అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చి దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేస్తోందన్నారు. పొగాకు కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే రూ.270 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.

బ్లాక్ బర్లీ పొగాకును మూడు గ్రేడ్ లుగా విభజించి, ఏ-గ్రేడ్ రకం పొగాకు క్వింటాకు రూ.12,000 ధర నిర్ణయించిందన్నారు. బి-గ్రేడ్ రకం పొగాకు రూ.9,000లు, సి-గ్రేడ్ రకం క్వింటా పొగాకు రూ.6,000లు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రతిరోజు ఒక కొనుగోలు కేంద్రంలో 20 మంది రైతులు నుంచి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళ్లు చేయడానికి ఏర్పాట్లు చేసిందన్నారు. మార్క్ ఫెడ్ నిబంధనలను అనుసరించాలని రైతులకు ఆయన సూచించారు. పొగాకును ఏ,బీ,సీ గ్రేడ్లుగా విభజించి బేళ్లుగా ప్యాకింగ్ చేసేప్పుడు నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు. పొగాకు రైతులకు అండగా ఉండేందుకు అవసరం అయితే మరిన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు సహకరిస్తారని స్పష్టం చేశారు. మామిడి, కోకో, వరి పంటల అధిక దిగుబడులు సమయంలో రైతులు నష్ట పోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టి, అన్నదాతలకు అదనపు ధర చెల్లించిందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. సీఎం చంద్రబాబు స్వయంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి... మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించారని గుర్తు చేశారు. రైతులకు ఎటువంటి నష్టం, కష్టం రాకుండా రైతుల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అదే విధంగా వచ్చే వ్యవసాయ సీజన్‌లో పంటలు వేసేప్పుడు రైతులు కూడా వ్యవసాయ అధికారుల సలహాలను స్వీకరించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి, స్థానిక కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## విధేయతకు పట్టం!

**ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాధవ్**



అమరావతి (చైతన్యరథం): ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ సోమవారం నామినేషన్ వేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాయలసీమ రెడ్డి వర్గానికి ఈ సారి అవకాశం వస్తుందని చాలా మంది అనుకున్నారు. గత కొన్నాళ్లుగా రాయలసీమకు అవకాశం దక్కడం లేదు. పదవులు కూడా కోస్తా ప్రాంతానికే ఇస్తున్నారు. కేంద్ర మంత్రి పదవులు, రాజ్యసభ పదవులు కూడా వారికే ఇస్తున్నారు. అధ్యక్ష పదవి రాయలసీమ ప్రాంత నేతకు ఇచ్చి దశాబ్దాలు అవుతోంది.

అందుకే ఈ సారి కిరణ్ కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లాంటి వాళ్లు చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ హైకమాండ్ వేరుగా ఆలోచించింది. విధేయతకే పట్టం కట్టింది. మాధవ్ ..బీజేపీకి అత్యంత నమ్మకస్తుడు. ఆయన తండ్రి పీవీ చలపతిరావు ఆరేళ్ల పాటు ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. బీసీ వర్గానికి చెందిన మాధవ్ కూడా చురుకైన నేతగా గుర్తింపు పొందారు. కూటమి పార్టీలను సమన్వయం చేసుకోవడంలో ఆయన సమర్థత చూపుతారని పార్టీ అధిష్టానం భావించినట్లుగా తెలుస్తోంది.

కిరణ్ కుమార్ రెడ్డి గత ఎన్నికలకు ముందుపార్టీలోకి వచ్చారు. విష్ణువర్ధన్ రెడ్డిపై వైసీపీ ముద్ర ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీకి అనుకూలంగా ఉండేవారని.. అమరావతిపై కించ పరిచే వ్యాఖ్యలు చేయడం.. ఇతర కారణాలతో ఆయన ఇమేజ్ దిగజార్చుకున్నారని చెబుతున్నారు. ఈ కారణంగా రాయలసీమ రెడ్డి నేతల కన్నా.. మళ్లీ కోస్తా నేతకే చాన్సివ్వాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ మోహన్ వ్యవహరించనున్నారు.

## బుడమేరు వద్ద సీసీ వాల్ పూర్తి

- రికార్డ్ స్థాయిలో ముంపు నివారణ పనులు
- మే లో టెండర్లు, సీజన్‌కు ముందే పూర్తి
- మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): గత ఏడాది విజయవాడ నగరాన్ని ముంచెత్తిన బుడమేరు వరదకు సంబంధించి గట్టుకు ఏర్పడ్డ మూడు గండ్లను కలుపుతూ 365 మీటర్ల పొడవున చేపట్టిన సీసీ వాల్ నిర్మాణం పూర్తయినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమవారం పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. సీసీ వాల్ నిర్మాణానికి సంబంధించిన పనులకు ఏప్రిల్ నెలలో ఆర్థిక ఆమోదం లభించగా మే నెలలో టెండర్లు పిలిచి సీజన్ ప్రారంభం కాకుండానే రికార్డు స్థాయిలో పూర్తి చేయగలిగామన్నారు. సీసీ వాల్‌తో పాటు ఏడు కిలోమీటర్లు పొడవునా బుడమేరు ఎడమ గట్టు అర మీటర్ ఎత్తు పెంచి నిర్మిస్తూ బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా వెలగలేరు రెగ్యులేటర్‌కి సంబంధించి గత ఏడాది వరద వచ్చినప్పుడు గేట్లు ఓపెన్ కాలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేకపోవడమే అందుకు కారణమన్నారు. గత ప్రభుత్వం మెయింటెనెన్స్ పనులు చేయలేదు. దీంతో అప్పట్లో స్థానిక రైతుల సహకారం తీసుకుని జేసీబీలు ఉపయో గించి ఆ గేట్లను తెరవాల్సి వచ్చింది. ఇప్పుడు వెలగలేరు రెగ్యులేటర్‌కు సంబంధించి మొత్తం 12 గేట్లను 1.8 కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొత్తవి అమర్చినట్లు మంత్రి చెప్పారు.

అదే విధంగా విజయవాడకు సంబంధించి బుడమేరు పాత ఛానెల్, ఎనికేపాడు యూటీ ప్రస్తుత సామర్థ్యం 4వేల క్యూసెక్కులుగా ఉంది.. దానిని 20వేల క్యూసెక్కులకు పెంచుతున్నామన్నారు. దీనితో పాటు, ఎనికేపాడు నుండి కొల్లేరుకు వెళ్ళే బుడమేరు డ్రైన్ 57 కిలోమీటర్లు పొడవునా మొత్తం డీ సిల్టింగ్ చేసుకుంటూ సాఫీగా నీరు ప్రవహించేలా పనులు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కొల్లేరుకు వచ్చే నీటిని కూడా ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి వెళ్ళేలా 9 కోట్ల రూపాయల నిధులతో టెండర్లు పిలిచి, అక్కడ పూడిక తీత పనులు కూడా చేస్తున్నామన్నారు.

ఆపరేషన్ బుడమేరు శాశ్వత ప్రాతిపదికను పూర్తి చేయడానికి మరో మూడు నాలుగు ఏళ్ళు పట్టవచ్చు. ఆర్థికపరమైన ఆమోదాలు, కేంద్రప్రభుత్వం, డిజాస్టర్ మేనేజ్ మెంట్, వీటన్నింటి సహకారంతో, సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఆయన సూచన మేరకు అప్పటివరకు వేచి చూడకుండా విజయవాడ నగరానికి భద్రత కోసం తక్షణ ప్రాతిపదికన చేపట్టిన పనులన్నీ పూర్తి చేసినట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు,ఈఎన్సీ నరసింహామూర్తి, కృష్ణా డెల్టా సీఈ రాంబాబుతో పాటు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జాతీయ పోటీల విజేతలకు

# రూ.91.75లక్షల క్రీడా ప్రోత్సాహకాలు విడుదల



**- కూటమి ప్రభుత్వానికి శాప్ ఛైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు**

విజయవాడ (చైతన్యరథం): జాతీయ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో క్రీడాప్రోత్సాహకాలను విడుదల చేయడం వారిలో మరింత ఉత్తేజాన్ని రేకెత్తించేందుకు దోహదపడతుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ వేదికగా జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరిగిన 38వ జాతీయ పోటీల్లో గెలుపొందిన ఏపీ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహకాలు విడుదల చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో రవినాయుడు తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి తలపడి గెలుపొందిన 15 మంది విజేతలకు రూ.91.75లక్షలు విడుదల చేయడం సంతోషదాయకమని వెల్లడించారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల సీఎం నారా చంద్రబాబు నాయుడు అనునిత్యం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడలను బలోపేతం చేస్తూ క్రీడాకారులకు అండగా నిలుస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రోత్సాహకాల విడుదలకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రివర్గానికి క్రీడాకారులు, శాప్ తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏడాది పాలనలో ఎన్నో విజయాలు

- జగన్ పాలనలో అధోగతిలో వ్యవసాయం
- కూటమి పాలనలో విప్లవాత్మక మార్పులతో అభివృద్ధి
- రైతులకు అండగా సీఎం చంద్రబాబు
- సంక్షేమంలోనూ మెరుగైన పథకాలు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి




అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో వ్యవసాయరంగాన్ని జగన్ రెడ్డి నట్టేట ముంచితే... ఏడాది పాలనలోనే అనేక విప్లవాత్మక మార్పులతో వ్యవసాయ రంగాన్ని నిలబెట్టడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 2 నుంచి బూత్, డివిజన్, క్లస్టర్ స్థాయిలో ప్రజల్లోకి వెళ్లి ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు కూటమి నాయకులు సంకల్పించారని తెలియజేశారు. వైసీపీ పాలనలో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారన్నారు. జగన్ పాలనలో ఖరీఫ్, రబీ సీజన్లలో కేవలం 41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి, రైతులకు మూడు నెలల వరకు చెల్లింపులు చేయకుండా ఇబ్బంది పెట్టారు. రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేశారు. కూటమి ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో కలిపి 68 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి, 24 గంటల్లోనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇప్పటివరకు రూ.18,000 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లోకి వెళ్లాయి. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వైసీపీ ప్రభుత్వం పెట్టిన ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లను రైతు ఖాతాల్లో జమచేసి, వారికి వెన్నుదన్నుగా నిలిచింది. అలాగే మిరప రైతులు సుమారు 4లక్షల ఎకరాల్లో పంట నష్టం ఎదుర్కొన్నప్పటికీ, జగన్ రెడ్డి ప్రభుత్వం పరిహారం అందించడంలో విఫలమై, రైతుల ఆత్మహత్యలకు కారణమైందని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.

## సంక్షేమంలో కూడా..

డ్రిప్ ఇరిగేషన్ పథకాలను వైసీపీ పూర్తిగా నిలిపివేసింది. దీనివల్ల 2018-19లో ఈ రంగంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ 2019-20 నాటికి నాలుగో స్థానానికి పడిపోయింది. జగన్ హయాంలో రాయలసీమలోని నీటి ప్రాజెక్టులను విస్మరించి, ఉద్యానరంగ వృద్ధిని సింగిల్ డిజిట్‌కు పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రిప్ ఇరిగేషన్‌ను పునరుద్ధరించి, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, ఇతర రైతులకు 50-90% రాయితీతో సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి దేశంలో మొదటి స్థానంలో నిలిపింది. హంద్రీ-నీవా ప్రాజెక్టును రూ.3,850 కోట్లతో పూర్తి చేసి, ఈ సంవత్సరంలోనే చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని సంకల్పించింది. కూటమి ప్రభుత్వం సంక్షేమంలో కూడా విప్లవాత్మక చర్యలు చేపట్టింది. వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌ను రూ.4,000కు పెంచింది. వికలాంగులకు వైకల్య స్థాయిని బట్టి రూ. 6 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్ అందిస్తోంది. 'తల్లికి వందనం" పథకం కింద 65 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000 అందించి, రూ.9,000 కోట్లు ఖర్చు చేసింది. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తోందని శ్రీనివాసరెడ్డి వివరించారు.

## స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా..

కూటమి ప్రభుత్వం 204 అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించి, పేదల ఆకలిని తీరుస్తోంది. 20,000 కి.మీ. మేర రోడ్లకు మరమ్మతులు చేసి గుంతల రహితంగా తీర్చి దిద్దింది. 7,000 కి.మీ. మేర సీసీ, బీటీ రహదారుల నిర్మాణం పూర్తి చేసింది. ఉచిత ఇసుక, తక్కువ ధరలో నాణ్యమైన మద్యం, అమరావతి పనుల పునఃప్రారంభం, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఆంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రూ.1.5 లక్షల గ్రాట్యుటీ, పోలవరం కోసం రూ.12,000 కోట్లు, విశాఖ స్టీల్ పరిరక్షణ, రూ.9.20 కోట్ల పెట్టుబడులు, మత్స్యకారులకు రూ.20,000 వేట నిషేధ భృతి, గంజాయి నిర్మూలన, చెత్త పన్ను రద్దు వంటి చర్యలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. రాయలసీమలో హంద్రీనీవా ప్రాజెక్టును రూ.3,850 కోట్లతో పూర్తిచేస్తోంది. చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందేలా ఈ ఏడాదిలోనే పనులు పూర్తిచేయాలన్న సంకల్పంతో ముందుకెళ్తోంది. గత ప్రభుత్వ అరాచకాలనుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2029 గెలుపే లక్ష్యంగా పనిచేస్తోంది. అంతేకాదు, స్వర్ణాంధ్ర 2047 సాధించే దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ పాలనలో శాంతి భద్రతల సమస్యలతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడిపారని, కానీ కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా, సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో విజయం, సంపద సృష్టి, ఉద్యోగ కల్పనలో ప్రగతి సాధించడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేస్తేనే స్వర్ణాంధ్ర సాధ్యం

- గాలివాటంగా నడుచుకుంటే ప్రగతి సాధించలేం
- ప్రజారోగ్య పరిరక్షణ దిశగా ప్రతి ఏడాదీ ఒక అడుగు ముందుకు పడాలి
- అధికారులతో సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్
- 2025-26 ఎజెండాపై ఉన్నతాధికారులతో 3 గంటల విస్తృత చర్చలు




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో ప్రజారోగ్య రంగంలో ఎదురైన అనుభవాలు, మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు, సాధించిన ఫలితాల నేపథ్యంలో 2025-26కు సంబంధించిన ఎజెండాపై వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఉన్నతాధికారులతో మూడు గంటల పాటు వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో చర్చించారు. సత్ఫలితాల్ని సాధించాలంటే నిర్దిష్ట లక్ష్యాల్ని నిర్ధారించుకుని, వాటి సాధన దిశగా నిరంతర సమీక్షలతో శ్రమించాలని అధికారులకు మంత్రి సూచించారు.

2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు పూర్తి ఆరోగ్యంతో కూడిన సమాజం ఎంతో అవసరమని, ఆ దిశగా ప్రతి ఏడాదీ ఒక ముందడుగు పడేలా శ్రమించాలని వైద్య సిబ్బందిని మంత్రి కోరారు. ఈ దిశగా సరైన నాయకత్వాన్ని అందించాలని శాఖ ఉన్నతాధికారులకు హితవు పలికారు. బండి నడిస్తే చాలు అన్న గాలివాటం దృక్పథాన్ని వీడి లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాల్ని అధిగమిస్తూ చిత్తశుద్ధితో కృషి చేస్తేనే స్వర్ణాంధ్ర సాకారమవుతుందని మంత్రి సత్యకుమార్ అన్నారు.

గతేడాది జూన్ లో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య రంగంలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్తితిని అధిగమించడానికి కృషి చేసింద ని.. తత్ఫలితంగా కొంత మేరకు మార్పు తేగలిగామని, ఇంకా చేయాల్సింది చాలా ఉందని, అందుకోసం ప్రతి ఏడాదీ నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని మంత్రి గుర్తుచేశారు. వైద్య సిబ్బంది హాజరు మొదలుకుని అత్యంత ఆధునిక వైద్య సేవల కల్పన వరకు మొత్తం 20 విషయాల్లో మూణ్నెల్లకోసారి ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు.

### *నిఘా వ్యవస్థల బలోపేతం*

ఆహార పదార్థాల కల్తీ నివారణ, నాణ్యమైన మందులు సరసమైన ధరలకు లభించేలా చూడడం, వైద్య కళాశాలల్లో విద్యా నాణ్యత పెంచడానికి నిఘా యంత్రాంగాన్ని పటిష్టం చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరముందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఐపీఎం(Institute of Preventive Medicine), డ్రగ్స్ కంట్రోల్ విభాగాల్లో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల లభ్యత, విద్యా నాణ్యతపై డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం మరింత దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ విషయంపై బుధవారం సమగ్రంగా సమీక్షిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, వివిధ విభాగాధిపతులు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విభాగాల వారీగా 2024-25లో జరిగిన ప్రయత్నాలు, ఫలితాల్ని వివరిస్తూ 2025-26కి లక్ష్యాలను వారు మంత్రికి వివరించారు.

# మెయిన్ అంగన్వాడీలుగా 5000 మినీ అంగన్వాడీలు

## - వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని 7 వేల మినీ అంగన్వాడీ కేంద్రాల్లో 5 వేల కేంద్రాలకు మెయిన్ అంగన్వాడీ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది.

ఈ మేరకు త్వరలో ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేయనుంది. మినీ అంగన్వాడీల్లో ఇప్పటివరకు ఒకరు మాత్రమే పనిచేస్తూ సదుపాయాల కొరతతో బాధపడుతున్నారు. మెయిన్ అంగన్వాడీ హోదా కల్పించిన తర్వాత, వాటిల్లో పనిచేస్తున్న వారికి అంగన్వాడీ టీచర్ హోదా ఇస్తూ, చట్టబద్ధమైన వేతనాలు, విధులు కల్పించనున్నారు. ఈ మార్పుతో రాష్ట్రవ్యాప్తంగా 5000 ఉద్యోగులు అంగన్వాడీ టీచర్లుగా నియమితులవుతారు. అంతేకాకుండా ఈ కేంద్రాల్లో అంగన్వాడీ హెల్పర్లగా పని చేయడానికి 5000 ఆయాల నియామకానికి నోటిఫికేషన్ త్వరలో విడుదల చేసేందుకు మంత్రి సంధ్యారాణి ప్రతిపాదించారు.

మిగిలిన 2000 మినీ అంగన్వాడీ కేంద్రాల్లో ఎప్పటినుండో పనిచేస్తున్న వాళ్లకి కనీస విద్యార్హత పొందేందుకు మానవతా దృక్పథంతో ఏడాది గడువు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి సంధ్యారాణి విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు.

ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని పలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో శిశు, మాతృ సంక్షేమ సేవలు మెరుగవుతాయి. అలాగే, వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. గిరిజన సంక్షేమాన్ని, స్త్రీ శిశు అభివృద్ధిని ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఈ కీలకమైన ముందడుగు వేసింది.


ఫైల్‌ఫోటో..

# రహదారుల అభివృద్ధితో ప్రభుత్వానికి మంచిపేరు

### ఆర్ అండ్ బీ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగింది - ఈఎన్‌సీ పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

విజయవాడ (చైతన్యరథం): గత ఏడాది పాలనలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత ఎక్కువ పేరు తెచ్చిన కీలకమైన అంశాలలో రహదారులు అభివృద్ధి ఒకటని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడలోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో సోమవారం ఆ శాఖ ఈఎన్‌సీ నయిముల్లా, క్వాలిటీ కంట్రోల్ ఛీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు పదవీ విరమణ ఆత్మీయ అభినందన సభలో మంత్రి ముఖ్య అతిధిగా మంత్రి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా రిటైరవుతున్న ఈఎన్‌సీ నయిముల్లా, సీఈ వెంకటేశ్వరావులను ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే ఆర్ అండ్ బీ శాఖ నూతన ఈఎన్‌సీ గా బాధ్యతలు స్వీకరించనున్న వి. రామచంద్రను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీఆర్డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, ఆర్డీసీ ఎండీ ఎల్. శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, మన ఆర్ అండ్ బీ శాఖ కుటుంబ సభ్యులకు సంబంధించి రిటైర్‌మెంట్ కార్యక్రమం జరుగుతున్న క్రమంలో ఇక్కడకు వచ్చానన్నారు. గత ఏడాది ఆర్ అండ్ బీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ నయిముల్లాలతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ శాఖ పురోగతికి పనిచేశామన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏడాది పాలనలో అత్యంత పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన అంశాల్లో రోడ్ల మరమ్మతులు, రహదారులు అభివృద్ధి కూడా ఒకటని మంత్రి తెలిపారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో గుంతలు పడి అతి దారుణంగా మారిన రోడ్లను మన ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఒక ఛాలెంజ్‌గా తీసుకుని గోతుల రహితంగా తీర్చిదిద్దామన్నారు.

సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయడంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. దీంతో నేడు ప్రజల్లో సైతం ఆర్ అండ్ బీ శాఖపై మరింత నమ్మకం పెరిగిందన్నారు. శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారులు వరకు అంతా కలిసి సమన్వయంతో ముందుకు సాగడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, శాఖకు మంచి పేరు వస్తోందన్నారు. రిటైర్ అవుతున్న ఉన్నతాధికారులు భవిష్యత్తులో కుటుంబంతో కలిసి ప్రశాంత జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.. అదే సమయంలో వారి అనుభవం దృష్ట్యా, వారి విలువైన సూచనలు, సలహాలను భవిష్యత్తులో ఆర్ అండ్ బీ శాఖలో అవసరమైనప్పుడు వాడుకుంటామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

### వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ పనుల్లో జాప్యం..

## నిర్మాణ ఏజెన్సీలు, అధికారులకు నోటీసులు

**- మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం**
**- పనులపై వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్ష**
**- నిర్దేశిత లక్ష్యంలోగా పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టీకరణ**



విజయవాడ (చైతన్యరథం): వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనుల్లో జాప్యంపై అధికారులు, నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ జలవనరుల క్యాంపు కార్యాలయంలో వెలిగొండ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సోమవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు జరుగకుండా జాప్యం చేస్తున్న ఏజెన్సీలకు, అధికారులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సొరంగాల్లో బెంచింగ్, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో టన్నెల్ లో ఉన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపుకు కోర్టు కేసు అడ్డంకిగా ఉన్న నేపథ్యంలో మిషన్ విలువ నిర్ణయించేందుకు సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామని తెలిపారు. ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

ఇక పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల్లో హైవే బ్రిడ్జి, పంపా ఆక్విడెక్ట్, కృష్ణవరం సైఫన్ వంటి క్లిష్టతర పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈలు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు శుభవార్త

***- వేతనాల పెంపుపై సానుకూలంగా ప్రభుత్వం***

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల (APTWREIS) విద్యా సంస్థల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న అనేక మంది ఉద్యోగులు గత కొన్ని సంవత్సరాలుగా చాలా తక్కువ వేతనాలతో జీవన పోరాటం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు మార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం వారి కష్టాలకు విముక్తి కలిగించనుంది.

గురుకులాల్లో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయులతో ఏడాది కాలంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పలుమార్లు ప్రత్యక్షంగా సమావేశాలు జరిపి, వారి సమస్యలను చర్చించి, ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. వారి జీవితాల్లో స్థిరత్వం, గౌరవప్రదమైన జీవనం కోసం వేతనాల్లో తగిన పెంపు అవసరం అనే భావనతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఈ అంశాన్ని వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, గిరిజన గురుకుల ఉద్యోగుల సమస్యను ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తూ, వేతనాల పెంపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చలు పూర్తయ్యాయి. త్వరలోనే దీనిపై జీవో వెలువడనుంది. ఈ నిర్ణయం వేలాది మంది గిరిజన ఉద్యోగుల జీవితాల్లో ఆనందం నింపనుంది. గిరిజన సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందనేందుకు ఇదో నిదర్శనం.

# సిట్ అదుపులో చెవిరెడ్డి పీఏలు



విజయవాడ (చైతన్యరథం): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో ఇప్పటికే అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పీఏలు బాలాజీ, నవీన్‌లను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కాల్ లొకేషన్ ఆధారంగా వారిద్దరూ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉన్నట్లుగా తెలుసుకున్న సిట్ అధికారులు అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. లిక్కర్ స్కాం డబ్బుల ప్రధాన హ్యాండ్లర్‌గా పని చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి .. ఆ సొమ్మును వివిధ వ్యక్తులతో పలు చోట్లకు తరలించారు. ఎన్నికల సమయంలో వాటిని మళ్లీ ఏపీకి తీసుకు వచ్చారు. ఓ లారీలో ప్రత్యేక అరలు ఏర్పాటు చేసుకుని తరలిస్తున్న రూ. ఎనిమిది కోట్ల ఇరవై లక్షల నగదును అప్పట్లో ఈసీ స్వాధీనం చేసుకుంది.

ఇప్పుడు దర్యాప్తులో భాగంగా ఆ డబ్బు లిక్కర్ స్కాంలో వసూలు చేసినదేనని గుర్తించి.. సిట్ అధికారులు ఆరా తీశారు. ఈ విషయం తెలియగానే.. ఆ డబ్బులను తీసుకు వస్తూ అప్పట్లో పోలీసులకు చిక్కిన బాలాజీ, నవీన్ అనే వ్యక్తుల్ని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అజ్ఞాతంలోకి పంపేశారు. మధ్యప్రదేశ్‌లో రహస్యంగా తలదాచుకున్న వీరిద్దర్నీ సిట్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**సిట్ కస్టడీకి చెవిరెడ్డి**

చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన బినామీ వెంకటేష్ నాయుడులను మూడు రోజులపాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ కోరగా, వీరిని విచారించేందుకు మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జులై 1 నుంచి 3వ తేదీ వరకు వీరిద్దరిని సిట్ అధికారులు విచారించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు వీరిని విచారించాలని ఆ ఆదేశాల్లో న్యాయమూర్తి స్పష్టం చేశారు.

**మోహిత్ రెడ్డికి చుక్కెదురు**

మరోవైపు ఇదే లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డి భాస్కరరెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అతడు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ లిక్కర్ స్కామ్ కేసులో మోహిత్ రెడ్డి ఏ 39గా ఉన్నారు.




# చరిత్రలో నిలిచిపోయేలా రొట్టెల పండుగ

## భారీగా తరలివచ్చే భక్తుల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు : మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి

నెల్లూరు (చైతన్యరథం): కుల మతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా జూలై 6 నుంచి నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి ఈ పండుగ జరిగే బారా షహీద్ దర్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్వర్ణాల చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించే పనులను జెండా ఊపి అయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చరిత్రలో నిలిచిపోయేలా బారాషహిద్ దర్గా లో రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2014-2019లో తాను మంత్రిగా ఉన్న సమయంలో దర్గాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకించి మహిళా భక్తుల కోసం రూమ్‌లు నిర్మించామని వివరించారు. దర్గాలో హాల్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు ఐదు కోట్ల రూపాయల నిధులు విడుదల చేశారని.. మెరుగైన డిజైన్‌తో హాల్ నిర్మించేందుకు రూ. 9 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు అధికారులు చర్చించి హాల్ డిజైన్ ఫైనల్ చేస్తున్నారని.. రొట్టెల పండుగ అయిన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు. భక్తులు కోరిన కోరికలు నెరవేరుతున్నాయి కాబట్టి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు వస్తున్నారని.. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని.. మరో రెండు రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మీడియాకు తెలిపారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకి బారాషహీద్ దర్గా కమిటీ నూతన అధ్యక్షుని ప్రమాణస్వీకారం ఉంటుందని తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మైనార్టీ నాయకులు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దిరెడ్డి అనుచరులు దాడి చేశారు





- చర్యలు తీసుకోని న్యాయం చేయాలి
- టీడీపీ నేతలకు బాధితుడి వినతి
- వివిధ సమస్యలపై కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు
- వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యలపై అర్జీదారులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్, గుంటూరు డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు.. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

చిత్తూరు జిల్లా పెదపంజాణి మండలానికి చెందిన రామకృష్ణ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. మూడు నెలల క్రితం కారులో వెళ్తున్న తనపై వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు దాడి చేశారని.. దీనిపై పుంగనూరు ఎస్పైకి ఫిర్యాదు చేస్తే నేటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. తనపై దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకు చెందిన వెలగపూడి సుబ్బలక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. తాము ఉండే నివాసాన్ని కబ్జాదారులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొని తమను ఇబ్బంది పెడుతున్నారని, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోండేపాడు గ్రామానికి చెందిన దాసరి మాణిక్యం విజ్ఞప్తి చేస్తూ. తమ స్థలం ఆక్రమణకు గురైందని.. దీనిపై కోర్టుకు వెళితే కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా కబ్జా దారులు స్థలాన్ని ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఈస్ట్‌కు చెందిన పాతూరి సుబ్బారావు విజ్ఞప్తి చేస్తూ.. నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన వ్యక్తి తమ వద్ద రూ. 6,88,000 డబ్బులు తీసుకొని పదేళ్లు అవుతున్నా.. తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాల్సిందిగా వేడుకున్నారు.

ఎన్టీఆర్ జిల్లా కంద్రిగకు చెందిన కొడాలి స్వాతి విజ్ఞప్తి చేస్తూ.. గత నాలుగు సంవత్సరాలుగా తమ భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఎమ్మార్వో ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని దయ చేసి తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన వై. శ్రీనివాసులు అభ్యర్థిస్తూ.. ధర్మవరం పురపాలక సంఘం ఇంజనీరింగ్ సెక్షన్ లో గత 28 సంవత్సరాల నుండి పనిచేస్తున్న తనను గత వైసీపీ ప్రభుత్వంలో అకారణంగా తొలగించి వైసీపీ వారిని నియమించుకున్నారని... దయచేసి తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం ఉమాపతినగర్‌కు చెందిన ఎన్. శ్రీనివాసరావు, గుడపాటి సురేష్, తదితరులు విజ్ఞప్తి చేస్తూ.. ఒక వ్యక్తి వ్యక్తి తమ వద్ద జొన్నలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని తమ డబ్బులు తమకు ఇప్పించాలని విన్నవించారు.

తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రాజనాల కండ్రిక గ్రామానికి చెందిన జి. అనిల్ రాజు విజ్ఞప్తి చేస్తూ.. తమ ఇంట్లో దొంగలు పడి రూ. 50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు తీసుకెళ్లారని.. పోలీసు అధికారులు త్వరగా దొంగలను పట్టుకొని నగదు, ఆభరణాలు రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నాడు ఐటీ.. నేడు క్వాంటమ్, ఏఐ
# సీఎం ప్రతి ఆలోచనా యువత భవిత.. రాష్ట్రప్రగతి కోసమే : ప్రత్తిపాటి

**●ఏపీని సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మార్చడమే చంద్రబాబు లక్ష్యం**

**● రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి.. ఉద్యోగావకాశాలు కల్పించాలన్నదే లోకేశ్ ఆలోచన**

**●గ్రామీణ ప్రాంత యువత కమ్యూనికేషన్ స్కిల్స్..ఆంగ్లంపై పట్టు సాధించాలి**



చిలకలూరిపేట (చైతన్యరథం): పెట్టుబడులు.. పరిశ్రమల ఆకర్షణతో రాష్ట్రయువతకు బంగారు భవిష్యత్ ను అందించి, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రాష్ట్ర యువత సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అని, ఆ దిశగా యువత తమను తాము మెరికల్లా తీర్చిదిద్దుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. పట్టణంలోని మార్గదర్శి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్తిపాటి... మేళా ప్రారంభించిన అనంతరం యువతను ఉద్దేశించి మాట్లాడారు.

గతంలో ఐటీని అభివృద్ధిచేసిన చంద్రబాబు.. ఇప్పుడు క్వాంటమ్, ఏ.ఐపై దృష్టిపెట్టారు

క్వాంటమ్ కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న సదాశయం దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని, గతంలో ఉమ్మడిరాష్ట్రంలో ఐటీరంగాన్ని అభివృద్ధిచేయడంలో చంద్రబాబు కీలకపాత్ర పోషించిన విషయం నేటియువత గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. అమరావతిని క్వాంటమ్.. ఏ.ఐ రంగాలకు హబ్ గా మార్చాలన్న ముఖ్యమంత్రి ప్రణాళికలన్నీ రాష్ట్ర ప్రగతిలో భాగమేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. టీ.సీ.ఎస్, ఐ.బీ.ఎం, ఎల్ అండ్ టీ సహకారంతో అమరావతిలో అతిపెద్ద క్వాంటమ్ వ్యాలీని సృష్టిస్తున్నారని, దానివల్ల భవిష్యత్ లో ఏపీ యువత క్వాంటమ్ కంప్యూటింగ్ లో ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తుందని ప్రత్తిపాటి తెలిపారు.

చదువుతో పాటు అదనపు అర్హతలు ఉంటేనే అన్నిరంగాల్లో రాణిస్తారు..

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే యువత కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లంపై పట్టు సాధించాలని ప్రత్తిపాటి సూచించారు. తెలుగువారికి కష్టపడేతత్వం ఎక్కువని, దానికి తోడు నలుగురిలో రాణించాలంటే మంచి స్కిల్స్ తప్పనిసరి అని ప్రత్తిపాటి చెప్పారు. భవిష్యత్ లో ప్రతీది ఐటీతో ముడిపడి ఉంటుందని, ఆ రంగంలో రాణించాలన్నా.. విదేశాల్లో స్థిరపడాలన్నా... ప్రతి ఒక్కరూ చదువుతో పాటు అదనపు అర్హతలు సాధించాలని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. జాబ్ మేళాలు నిర్వహించే కంపెనీలు కూడా ప్రతిభగల వారికి అవసరమైన అదనపు నైపుణ్యం అందించి, ఉద్యోగ శిక్షణలో రాటుదేలేలా చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చేబ్రోలు మహేష్, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, పఠాన్ సమాధ్ ఖాన్, మద్దమాల రవి, బేరింగ్ మౌలాలి తదితరులున్నారు.

# నేడు సీఎం చంద్రబాబు కొవ్వూరులో పర్యటన

**●పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దే ఆయన నగదు పంపిణీ చేపట్టనున్న చంద్రబాబునాయుడు**




కొవ్వూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అమరావతిలో ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఉదయం 10.00 గంటలకు సీఎం చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో బయలుదేరనున్నారు. ఉదయం 10.30 గంటలకు కొవ్వూరు మండలం కాపవరం చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 10.45 గంటలకు మలకపల్లికి సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. 10.45 నుంచి 11.05 వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దే ఆయన నగదు పంపిణీ చేయనున్నారు. ఉదయం 11.10 గంటలకు గ్రామ సభ వేదికకు సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. 11.10 నుంచి మ.12.40 వరకు గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు కొవ్వూరు మండలం కాపవరం ఏ.ఎమ్.సికి ఆయన చేరుకుంటారు. ఆ తర్వాత 1. 30 గంటల నుంచి మ. 3.00 గంటల వరకు పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం కానున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 3.30 గంటలకు రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు. 3.40 గంటలకు సీఎం చంద్రబాబు విమానంలో బెంగుళూరు బయలుదేరి వెళ్లనున్నారు.

# ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చొరవతో విద్యార్థులకు 70 పరుపులు వితరణ



శృంగవరపుకోట (చైతన్యరథం): నియోజకవర్గం కొత్తవలస మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఈ నెల 25వ తేదిన జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 250 పరుపులు బూడిద అయిన విషయం తెలుసుకున్న శృంగవరపుకోట ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు సహాయ సహకారాలు అందించిన విషయం తెలిసిందే. విద్యార్థుల నిద్రించేందుకు అవస్థలు పడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కొత్తవలస మండలంలో కంటకాపల్లి గ్రామం వద్ద ఉన్న శారద కర్మాగారం యాజమాన్యంతో చర్చించి సీఎస్ఆర్ నిధులతో సుమారు 70 పరుపులను విద్యార్థులకు సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ... అనుకోని సంఘటన పాఠశాలలో జరగటం తన మనసును కలిచి వేసిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు చేసేందుకు సమ్మతి తెలిపారని, నేడు ఈ శారదా కర్మాగారం యాజమాన్యం సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో పాఠశాలకు కావాల్సిన వసతులను సమకూర్చేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. శారదా కర్మాగారానికి చెందిన సన్యాసిరావు మాట్లాడుతూ... కర్మాగార సిఎస్ఆర్ నిధుల్లో ఇప్పటికే అనేక సహాయ, సహకారాలు చుట్టుపక్కల ప్రాంతాల్లో పాఠశాలకు, గ్రామాలకు అందించామని రానున్న రోజుల్లో మా సేవలు ఇంకా విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, చింతలపాలెం సర్పంచ్ మాకిన సీతారాంపాత్రుడు, శారదా కర్మాగార హెచ్ఆర్ శంకర్రావు, కొత్తవలస మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ కోరుపోలు అప్పారావు, విశాఖ పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పి.రత్నాజీ, మండల యువత కె.ఉపేంద్ర, గొంప దుర్గా రమేష్, స్కూల్ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి వెళ్దాం... ప్రగతిని తెలియజేద్దాం

**● పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**




నరసన్నపేట (చైతన్యరథం): ప్రజల్లోకి వెళ్దాం... ప్రగతిని తెలియజేద్దామని పార్టీ శ్రేణులకు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి పిలుపునిచ్చారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంపై సోమవారం నరసన్నపేట, పోలాకి మండలాల ముఖ్యనాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ... తొలి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనమైందని, కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పుడిప్పుడే ఆర్థిక ఆగాధం నుంచి తేరుకుంటుందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామని, రాబోయే నాలుగేళ్లలో కూటమి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రమణమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నరసన్నపేట, పోలాకి మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు మహర్దశ... వేల మందికి ఉపాధి

**●5వేల మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చనున్న కూటమి ప్రభుత్వం : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**




సాలూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మినీ అంగన్వాడీ కేంద్రాలైన సుమారుగా 7000 కేంద్రాల్లో, 5000 మినీ అంగన్వాడీలకు మెయిన్ అంగన్వాడీ హోదా కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ మేరకు త్వరలో ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేయనుంది. మినీ అంగన్వాడీల్లో ఇప్పటివరకు ఒకరు మాత్రమే పనిచేస్తూ సదుపాయాల కొరతతో బాధపడుతున్నారు. మెయిన్ అంగన్వాడీ హోదా కల్పించిన తర్వాత, వారికి అంగన్వాడీ టీచర్ హోదా ఇస్తూ, చట్టబద్ధమైన వేతనాలు, విధులు కల్పించనున్నారు. ఈ మార్పుతో రాష్ట్రవ్యాప్తంగా 5000 ఉద్యోగులు అంగన్వాడీ టీచర్లుగా నియమించబడతారు. అంతేకాకుండా, ఈ కేంద్రాల్లో అంగన్వాడీ హెల్పర్స్‌గా పని చేయడానికి 5000 ఆయాల నియామకానికి నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయనున్నట్టు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రతిపాదించారు. మిగిలిన 2000 మినీ అంగన్వాడీ కేంద్రాల్లో ఎప్పటినుండో పనిచేస్తున్న వాళ్లకి కనీస అర్హత పొందేదుకు మానవతా దృక్పదంతో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్యమంత్రి వర్యులతో చర్చించి వాళ్ళకి ఒక సంవత్సరం గడువు ఇవ్వవలసిందిగా కోరారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని పలు గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో శిశు, మాతృ సంక్షేమ సేవలు మెరుగవుతాయి. అలాగే, వేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. గిరిజన సంక్షేమాన్ని, స్త్రీ శిశు అభివృద్ధిని ప్రథమ ప్రాధాన్యతగా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఈ కీలకమైన ముందడుగు వేసింది.

**గిరిజన గురుకులాల్లో అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు త్వరలో శుభవార్త**

ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో అవుట్సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న అనేక మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గత కొన్ని సంవత్సరాలుగా చాలా తక్కువ వేతనాలతో జీవన పోరాటం చేస్తున్నారు. గడిచిన ప్రభుత్వం హయాంలో పలుమార్లు విజ్ఞప్తులు చేసినా వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైన దాఖలాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో, నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖకు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురుకులాల్లో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయులతో పలుమార్లు ప్రత్యక్షంగా సమావేశాలు జరిపి, వారి సమస్యలను చర్చించి, ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను దగ్గరగా చూసిన పిదప, వారి జీవితాల్లో స్థిరత్వం మరియు గౌరవప్రదమైన జీవనం కోసం వేతనాల్లో తగిన పెంపు అవసరం అనే భావనతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఈ అంశాన్ని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నప్పటికీ, గిరిజన గురుకుల ఉద్యోగుల సమస్యను ప్రత్యేక దృష్టితో పరిశీలిస్తూ, వేతనాల పెంపు అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తున్నామని, ఇప్పటికే ఈ విషయంపై సంబంధిత అధికారులతో చర్చలు పూర్తయ్యాయి. త్వరలోనే దీనిపై జి. వో వెలువడనుంది. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది గిరిజన ఉద్యోగుల జీవితాల్లో కొత్త ఆశలు నెలకొననున్నాయి.

# కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం..

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి



కైకలూరు (చైతన్యరథం): కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం శృంగవరప్పాడులో కొల్లేరు ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కొల్లేరు పరిరక్షణ సమితి ప్రతినిధులతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి తాను కైకలూరు నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సందర్భంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలు కొల్లేరు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని ఎంపీ తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఎంపీగా విజయం సాధించిన అనంతరం కొల్లేరు ప్రాంత వాసుల సమస్యపై పూర్తి అవగాహన చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి నోచుకోదని, ఆ విషయంలో జోక్యం చేసుకోవద్దని కొందరు సన్నిహితులు తనను వారించినా, కొల్లేరు ప్రజలకు న్యాయం జరగాలని కోరుకున్న తాను వారి పక్షాన నిలబడినట్లు ఎంపీ స్పష్టం చేశారు. సమస్య ఎప్పటిలోగా పరిష్కారం అవుతుందనే నిర్దిష్టమైన గడువు తాను చెప్పలేనని, కొల్లేరు సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఘంటాపథంగా తెలియజేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగానే, మానవతా దృక్పథంతో కొల్లేరు ప్రజల సమస్యకు పరిష్కారం చూపుదామని భరోసా కల్పించాలని ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ కొల్లేరు సమస్య అనే చిక్కుముడిని ఒక్కొక్కటిగా విప్పుకుంటూ ముందుకు వెళుతున్నట్లు ఎంపీ వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల కొల్లేరు ప్రాంతంలో పర్యటించిన సెంట్రల్ ఎంపవర్మెంట్ కమిటీ ప్రతినిధులు కూడా సానుకూలంగానే నివేదిక సమర్పించారని ఎంపీ తెలిపారు. ఈ ప్రాంతంలో నెలకొన్న ఇతరత్రా సమస్యలను మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వివరించనునట్లు ఎంపీ పేర్కొన్నారు. కొల్లేరు ప్రాంత వాసులు ధైర్యంగా ఉండాలని, కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు అండగా ఉన్నాయని, త్వరలోనే శుభవార్త వింటారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా కల్పించారు. అనంతరం కొల్లేరు ప్రాంత ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. తొలిసారి తమ గ్రామానికి వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. అంతకు ముందు శృంగవరప్పాడుకు చెందిన మహిళలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కొల్లేటికోటలో కొలువైన శ్రీశ్రీ పెద్దింటి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని ప్రతి ఇంటికి తెలియజేయాలి



అనకాపల్లి (చైతన్యరథం): ఏడాది కాలంలోనే అందరికి సుపరిపాలన అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమాభివృద్ధిని ప్రతిఇంటికి తెలియజేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అనకాపల్లి పట్టణం, శ్రీ సత్యాస్ లక్ష్మీ గ్రాండ్ మండపంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై టీడీపీ శ్రేణులకు శిక్షణా కార్యక్రమం చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... జగన్‌రెడ్డి గత తుగ్లక్ పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టుదల, నిరంతర కృషితో ఇప్పుడిప్పుడే రాష్ట్రం బయటపడుతుందని అన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే పనుల గురించి ప్రజలు తెలియజేయాలని అందుకు ప్రతి ఒక్కరూ జూలై 2వ తేది నుంచి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ వెళ్దాం... కూటమి పాలన గురించి చెబుదాం

- అభివృద్ధి, సంక్షేమం జోడేడ్లుగా సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పిద్దామని శ్రేణులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే యనమల దివ్య



తుని (చైతన్యరథం): జగన్ విధ్వంసకర పాలన అంతమొందించిన యావత్తూ ప్రజానీకం సుపరిపాలన కోసం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి పట్టాభిషేకం చేశారని, ఇదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజా ఆకాంక్షల నెరవేర్చడంలో ఎక్కడా వెనుకడుగు వేయలేదని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం జోడేడ్లుగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి ఏడాది సుపరిపాలనలో తొలిఅడుగు వేసిందని, మరో వైపు స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో ప్రణాళికాయుతంగా వడివడి అడుగులు వేస్తుందన్నారు. ఏడాది సుపరిపాలనంతా జనరంజకమేనని, అభివృద్ధీ..సంక్షేమమే... సుపరిపాలన తొలి అడుగు నినాదంతో ఇంటింటికీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. సోమవారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, కన్వీనర్లతో ఎమ్మెల్యే యనమల దివ్య ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ. ఇంటింటికీ టీడీపీ ప్రతిష్టాత్మకంగా జూలై 2వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, నెల రోజులపాటు కొనసాగే ఈకార్యక్రమం ద్వారా క్లస్టర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు టీడీపీ యాప్ ద్వారా రోజుకి 50 ఇళ్ళకు వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇదే సందర్భంలో ఆయా కుటుంబాలు ప్రభుత్వ పరంగా ఆశిస్తున్న సహాయాన్ని యాప్‌లో అప్ లోడ్ చేయాలని సూచించారు. ఇది అందరి బాధ్యత అని, బేషజాలాలకు తావులేకుండా సమర్ధవంతంగా డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. క్లస్టర్లు శివశంకర్, డాక్టర్ గంట్ల చిన్నారావు యాప్ వినియోగంపై పవర్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ కుసుమంచి శోభారాణి, గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, చొక్కా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రైల్వే ఛార్జీలు పెంపు



విజయవాడ (చైతన్యరథం): భారత రైల్వే నాన్ ఏసీ, ఏసీ ఛార్జీల విషయంలో కీలక మార్పులు చేసింది. ఛార్జీలను పెంచుతూ, టికెట్ బుకింగ్‌లో కొత్త నిబంధనలను జోడిస్తూ ఈ మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచే నూతన రైల్వే ఛార్జీలు, టికెట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని రైల్వే శాఖ వెల్లడించింది. జూలై 1 నుంచి మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్-ఏసీ ఛార్జీలను కిలోమీటరుకు ఒక పైసా చొప్పున అలాగే అన్ని ఏసీ క్లాస్‌లకు సంబంధించి కిలోమీటరుకు రెండు పైసాల చొప్పున ఛార్జీలను పెంచుతున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందుకు సంబంధించి జూన్ 24న అధికారులు నూతన ఛార్జీలను ప్రతిపాదించారు. ఈ విషయంపై సోమవారం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. నిత్యం రైళ్లలో ప్రయాణించే వారిని దృష్టిలో ఉంచుకొని సబర్బన్ రైళ్ల టికెట్ల ఛార్జీలలో ఎలాంటి మార్పు చేయలేదు.

**నూతన రైల్వే ఛార్జీలు ఇలా ఉన్నాయి!**

సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500కిలోమీటర్ల వరకు సాధారణ ఛార్జీలే ఉండనున్నాయి. 501 నుంచి 1500 కిలో మీటర్ల వరకు టికెట్‌పై ఐదు రూపాయలు, 1500 నుంచి 2500 కిలోమీటర్ల వరకు 10 రుపాయలు, 2501 నుంచి 3 వేల కిలోమీటర్ల వరకు టికెట్‌పై 15 రూపాయలు చొప్పును పెంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. జూలై 1 నుంచి సాధారణ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికులు రైలు ప్రయాణానికి కిలోమీటరుకు అర పైస ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. రిజర్వేషన్ ఛార్జ్, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు నూతన ఛార్జీలు అమలుకావని తెలిపింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసిన రైల్వేశాఖ జులై 1 నుంచి అమల్లోకి తీసుకురావాలంటూ అన్ని జోన్ల మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేసింది.

# వైసీపీ హయాంలో కుదేలైన వ్యవసాయం

- కూటమి ప్రభుత్వంలో రైతులకు ఫ్రీగా ఆయిల్‌పామ్ మొక్కలు... హెక్టారుకు రూ. 5,250 సాగుకు సాయం



ఏలూరు (చైతన్యరథం): గత వైసీపీ సర్కార్‌లో వ్యవసాయరంగం కుదేలైంది. ఈ క్రమంలో అన్నదాతలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. గిట్టుబాటు ధర కాదు కదా అందులో సగం కూడా దొరకక వారు నష్టాల ఊబిలోకి పడిపోయారు. ఇక పంటే దండగ అని విసిగివేసారే స్థితికి వారిని తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం రావడంతో రైతులకు మంచి రోజులు ఒక్కొక్కటిగా వస్తున్నాయి. దీంతో వారిని గట్టెక్కించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. మెట్ట ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా ఉంది. గతంలో గిట్టుబాటు ధర లేక కర్షకులు నానా అవస్థలు పడ్డారు. తాజాగా ప్రభుత్వం వంద శాతం రాయితీతో మొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టింది. నీటి వసతి అధికంగా ఉన్న అన్నదాతలు ఈ పంట సాగు చేసుకుంటే లాభాలు పొందొచ్చని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఏలూరు జిల్లాలో ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు 1,35,652 ఎకరాల్లో సాగు అవుతోంది. ఈ సంవత్సరం అన్నదాతలకు ఉచితంగా మొక్కలను అందించి 35,000ల ఎకరాల్లో అదనంగా పంట సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా అర్జీల స్వీకరణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎరువులు తదితరాల నిమిత్తం నాలుగేళ్ల పాటు సంవత్సరానికి హెక్టారుకు రూ.5,250 చొప్పున సాగు సాయం, గెలలు కోసే కత్తులు, చాప్‌కట్టర్లు, మినీ ట్రాక్టర్‌కు ట్రాలీ 50 శాతం రాయితీపై అందిస్తారు.

వర్మీ కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు అవకాశం ఉంది. నాలుగో ఏడాది నుంచి పంట చేతికి వస్తుంది. ఈ విధంగా 25 సంవత్సరాలకు పైగా దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో టన్ను ధర రూ.18,500 నుంచి రూ.19,000ల మధ్యలో ఉంటుంది. ఇంటిలో వంట నూనె కొరతను తీర్చేందుకు ఈ పంటను ఏపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గోద్రేజ్, పతంజలి సంస్థలు అన్నదాతల నుంచి ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తున్నాయి. అన్నదాతలకు ఈ పంట లాభసాటిగా ఉంటుందని నూజివీడు ఉద్యాన అధికారి ఆర్?.హేమ తెలిపారు. నాలుగు సంవత్సరాల పాటు ఎరువులు అంతర పంటలకు నగదు లభిస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా మొక్కలు, రాయితీలు పొందవచ్చని హేమ వెల్లడించారు.

# మా టిఫిన్ బండికి అనుమతివ్వండి

- తనకు వచ్చిన కష్టానికి కలెక్టరేట్ మెట్లు ఎక్కిన 8 ఏళ్ల బాలుడు
- జీవనాధారమైన టిఫిన్ బండిని నడుపుకునేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి

గుంటూరు (చైతన్యరథం): చిన్న వయసులో తమకు వచ్చిన కష్టాన్ని చూసి చలించిపోయాడు 8 ఏళ్ల బాలుడు. అధికారులు తమ సమస్యను పట్టించుకోకపోవడంతో విసిగివేసారాడు. దీంతో ఏకంగా కలెక్టరేట్ మెట్లు ఎక్కాడు. తమ కుటుంబానికి జీవనాధారమైన టిఫిన్ బండిని నడుపుకునేందుకు అనుమతించాలని వేడుకున్నాడు. తన తల్లి పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని వాపోయాడు. ఈ క్రమంలో అందరం చనిపోదామని అమ్మ అంటోందని అందుకే కలెక్టరేట్‌కు వచ్చానని చెబుతున్నాడు ఆ బాలుడు. తన కుటుంబానికి జీవనాధారమైన టిఫిన్ బండిని పెట్టుకునేందుకు అనుమతించాలని గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం ఇచ్చాడు. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గుంటూరు నగరంలోని వెంకట్రావు పేటకు చెందిన అలవాల రాధిక స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద గతంలో టిఫిన్ బండి నడుపుతూ కుటుంబాన్ని పోషించేది. రోడ్డు విస్తరణ పనుల వల్ల ఇటీవల ఆ బండిని తొలగించారు. దీంతో జీవనోపాధి కోల్పోయామని హాస్పిటల్ బయట పరిసరాల్లో ఎక్కడైనా టిఫిన్ బండి పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని రాధిక పలుమార్లు అధికారులకు విన్నవించింది. అయినా ఫలితం లేకపోయింది.

దీంతో రాధిక కుమారుడు యశ్వంత్ ఈ విషయమై వినతిపత్రం ఇచ్చేందుకు ఇవాళ కలెక్టరేట్‌కు వచ్చాడు. తమ టిఫిన్ బండిని కాలువలో పడేశారని, జీవనానికి ఇబ్బందిగా ఉందని యశ్వంత్ వాపోయాడు. బండి పెట్టుకోవడానికి అనుమతివ్వాలని కోరినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అమ్మ చనిపోదామని అంటోందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు గుండె సంబంధిత సమస్య ఉందని, టిఫిన్ బండి పెట్టుకునేందుకు అనుమతివ్వాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వినతి పత్రాన్ని తీసుకొని నగరపాలక సంస్థ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. యశ్వంత్ కుటుంబానికి జీవనోపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.



# హ్యూమన్ పవర్ వినియోగించుకోవడం ఇలాగేనా?

- సచివాలయంలో ఇంటర్నెట్ కనెక్షన్ కూడా ఇవ్వలేరా ?
- సిబ్బందిని సమన్వయ పరుచుకోవడం తెలియడం లేదా ?
- ఎవరికి ఎక్కడ ఎలాంటి విధులు కేటాయించాలో ప్లానింగ్ లేదా
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): "గుంటూరు నగరంలో సచివాలయ సిబ్బందిని సమన్వయపరచుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. కనీసం ఏ సిబ్బంది ఎక్కడెక్కడ పని చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి. ఎవరిని ఎలాంటి విధులకు ఎలా వినియోగించుకోవాలో తెలియడం లేదు. కనీసం సచివాలయాల్లో ఇంటర్నెట్ కనెక్షన్ కూడా లేని దుస్థితి. గ్రీవెన్స్ చేయాలంటే ఇంటర్నెట్ లేదని చెబుతున్నారు. ఈ విషయం కార్పొరేషన్ అధికారులకు తెలుసా? లేదా?" అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ నిలదీశారు. సోమవారం గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యే నసీర్ అనేక ప్రశ్నలు సంధించారు. అధికారుల పనితీరు మార్చుకోవాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులతో కలిసి పని చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను కలుపుకొని వెళ్లాలన్నారు. ప్రభుత్వపరంగా అమలు చేసే ఎలాంటి కార్యక్రమమైనా తమకు ముందుగా సమాచారం అందించాలని చెప్పారు. గుంటూరు నగరంలో మొక్కల పెంపకం విషయంపై నసీర్ మాట్లాడారు. ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు పంపిణీ చేస్తున్నారు? ఇప్పటి వరకు వాటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు అనంతరం నగరంలో ప్రారంభించిన రోడ్ల నిర్మాణం విషయంలో ఇంజనీరింగ్ అధికారుల అలసత్వంపై నిలదీశారు. వెంటనే కొన్ని రోడ్లయినా పూర్తి చేసి ప్రజలకు అందించాలని సూచించారు. రోడ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే వేరే మార్గాన్ని ఆలోచించాలని ఈ సందర్భంగా కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డుల్లో పర్యటిస్తున్నామని, ఈ సందర్భంగా పారిశుధ్య సమస్య ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. కార్పొరేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపై పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): మున్సిపల్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో మండిపడ్డారు. అధికారులు తాము అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలకు తాను సంతృప్తి చెందటం లేదని, ప్రతి ప్రశ్నకు సమాధానం కూడా దాటవేత ధోరణి సరికాదన్నారు. గతంలో హోర్డింగ్, ఎల్ఈడీ డిస్ప్లేల ఏర్పాటు విషయంలో తాను అడిగిన ప్రశ్నకు సంబంధం లేకుండా సమాధానం ఇస్తున్నారని, నగరంలో యాడ్ ఏజెన్సీలు కోట్లాది రూపాయలు కార్పొరేషన్‌కు చెల్లించాలని అధికారులే చెప్తున్నారు. అసలు వారు కార్పొరేషన్ సూచించిన ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అనేది అధికారులు పరిశీలించాలన్నారు. ఖాళీ స్థలాల విషయంలో అనేకసార్లు కార్పొరేషన్, కమిషనర్ దృష్టికి తీసుకొచ్చినా అధికారుల చర్యలు శూన్యమన్నారు. గతంలో తాను శానిటరీ డ్రైవ్ నిర్వహించినప్పుడు మేయర్, కమిషనర్, పర్యటించినప్పుడు ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపించాయని, కమిషనర్ ఆ సమయంలో వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు సిబ్బంది పట్టించుకోలేదన్నారు. నల్లచెరువు, సాయి ఆదిత్య స్కూల్ ప్రాంతాలతో పాటు పలు చోట్ల రహదారుల పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఆ దారిలో నడవలేక ఇబ్బందులు ఎదురుకుంటున్నారని వెంటనే పనులు పూర్తయేలాగా చూడాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. నగరంలో పారిశుద్యం పడకేసిందని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ రోగాల పాలవుతున్నా నగర పాలక సిబ్బంది నిర్లక్ష్యం వీడకపోవడం బాధాకరమన్నారు. ప్రధాన రహదారులలో వీధి దీపాలు కూడా లేవని, శివారు ప్రాంతాలలో ప్రజలు సూర్యాస్తమయం తరువాత బయటకొచ్చే పరిస్థితి లేదని, పలు చోట్ల అంధకారం నెలకొనడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని వెంటనే వీధి దీపాల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

# ఏడాదిలోనే ఇంటింటికీ పథకాలు, ప్రతిఒక్కరికీ ప్రయోజనాలు : చీఫ్ విప్ జీవీ

- నేడు వినుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమావేశం
- జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలపై క్షేత్రస్థాయిలో ప్రచారంపై దిశానిర్దేశం



వినుకొండ(చైతన్యరథం): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఇంటింటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రతిఒక్కరికీ ఏదొక రూపంలో ప్రయోజనం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. ఇదే విషయంలో జులై-2 నుంచి నియోజకవర్గం మొత్తం విస్తృత ప్రచారం నిర్వహించబోతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ తొలి ఏడాది విజయాలు తెలియజేయడంతో పాటు ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలను అర్థం చేసుకుని చేసిన మంచిని వివరించడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. అందుకే ఈ కార్యక్రమం విజయవంతం కావడం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి మంగళవారం వినుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు నరసరావుపేట రోడ్డులోని గంగినేని కళ్యాణ మండపంలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై రెండో తేదీ నుంచి నిర్వహించనున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు - ఇంటింటికి తెలుగుదేశం' ప్రచారంపై జీవీ ఆంజనేయులు దిశానిర్దేశం చేయనున్నారని వెల్లడించారు. ఈ సమావేశానికి అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, గ్రామ నూతన కమిటీల అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

# నెలపాటు... పార్టీ యంత్రాంగమంతా ఇంటింటికీ వెళ్లాలి

- మండల స్థాయి నాయకులకు సూచించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం) : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నెలరోజుల పాటు ఇంటింటికీ తిరిగి కూటమి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి ఒక్కరికి వివరించాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ మండల స్థాయి ముఖ్య నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందని, ప్రతిఒక్కరూ పాల్గొని రాబోయే నాలుగు ఏళ్లలో ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధ్వంసంతో పాటు కూటమి ఏడాది పాలనలో సాధించిన విజయాల గురించి ప్రత్యేకంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు నాగోతు శౌరయ్య, కుర్రా అప్పారావు, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివారెడ్డి, పల్నాడు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి షేక్.నూర్జహాన్, మండలపార్టీ అధ్యక్షులు ఆర్తిమళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి ఎన్‌హెచ్ 16 ఎగ్జిట్ ర్యాంప్‌కు కేంద్రం ఆమోదం



మంగళగిరి (చైతన్యరథం): ప్రజల వైద్య అవసరాల రీత్యా మంగళగిరి ఎయిమ్స్‌కు చేరుకోవడానికి మంగళగిరి(ఎన్ హెచ్-16) వద్ద ఉన్న ఎంట్రీ ర్యాంప్‌ను ఎగ్జిట్ ర్యాంప్ మార్చేందుకు కేంద్ర రహదారుల శాఖ ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. దీని ఫలితంగా ఎయిమ్స్‌కు చేరుకోవాల్సిన దూరం. 4.66 కి. మీ నుంచి 1.26కి.మీకు తగ్గుతుందన్నారు. అత్యవసర వైద్యం, రోగుల రవాణా, వైద్య సిబ్బంది రాకపోకలకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్‌హెచ్ -16పై మూడు కీలక ప్రదేశాల్లో మొత్తం13 డైరెక్షనల్ బోర్డులను ఏర్పాటు చేయడానికి కూడా కేంద్రం అనుమతిచ్చిందని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. రోగులు, సందర్శకుల ట్రాఫిక్ నియంత్రణకు ఇది ఎంతో తోడ్పడనున్నట్లు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి చర్యలతో ప్రజలకు ప్రాధాన్యతనిచ్చే కేంద్ర ప్రభుత్వ నిబద్ధత మరోసారి స్పష్టమైందన్న పెమ్మసాని.. వేగవంతమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ఇది ఒక గొప్ప ముందడుగని అన్నారు. అనుమతులు మంజూరు చేసిన కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

# వీఆర్ హై స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ విద్య

**●ఈనెల 7న నారా లోకేష్ చేతుల మీదుగా అప్పర్ ప్రైమరీ తరగతులు ప్రారంభం**

**●రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి**



నెల్లూరు (చైతన్యరథం): వీఆర్ హై స్కూల్‌కు పూర్వ వైభవం వచ్చింది. ఎటు చూసినా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి సందడి వాతావరణం నెలకొంది. అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటల్ విద్య అందించేందుకు రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. గ్రామంలో సోమవారం అట్టహాసంగా వి.ఆర్ హైస్కూల్లో ప్రైమరీ తరగతులను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు చిన్నారులతో పాటు వీఆర్సీకి వచ్చిన తల్లితండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. వీఆర్ హైస్కూల్లో ఏర్పాట్లు, తరగతి గదులు డిజిటల్ విధానం, క్లాస్ రూమ్స్, ప్లే గ్రౌండ్ చూసి విద్యార్థులు తల్లిదండ్రులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. థాంక్యూ నారాయణ సార్ అంటూ వారంతా నినాదాలు చేశారు. ఆజన్మాంతం రుణపడి ఉంటామంటున్న పేద తల్లితండ్రులు మంత్రి నారాయణ ఎదుట బావోద్వేగానికి గురయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులను మంత్రి నారాయణ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. తరగతి గదులన్నింటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... అంతర్ జాతీయ ప్రమాణాలతో సిద్ధమైన వీఆర్సీ భవనాలను, ప్లేగ్రౌండ్‌ని అధికారికంగా ఏడో తేదీన రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రారంబిస్తారని తెలిపారు. నర్సరీ నుంచి ఐదో తరగతి వరకూ సోమవారం తరగతులు ప్రారంభించామన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఎల్లుండి నుంచి స్టార్ట్ చేస్తామని తెలియజేశారు. తాను చదివిన వీఆర్ హైస్కూల్‌ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. శ్రమించిన నా పిల్లలు, ఎన్సీసీ కంపెనీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తొలిరోజు స్కూల్‌కి వచ్చిన పిల్లలు, వారి తల్లితండ్రుల ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఈరోజు నాకు చాలా సంతృప్తిగా ఉందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వీఆర్సీ తరహాలో మరో రెండు స్కూల్స్‌ని సిద్ధం చేసేందుకు డీఎస్ఆర్ కంపెనీ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉన్నత స్థితిలో ఉన్న నెల్లూరు వాసులు స్కూల్స్ ఆధునీకరణకు పీ-4 ద్వారా ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. వేలాదిమంది పేదపిల్లల భవిష్యత్తుకు సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జయింట్ కలెక్టర్ కార్తిక్, మున్సిపల్ కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, డివిజన్ క్లస్టర్ అజయ్, కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి, ప్రెసిడెంట్ సుజన్, కార్పొరేటర్లు, టీడీపీ ముఖ్యనేతలు, అధికారులు పాల్గొన్నారు.

# తొలి ఏడాది సుపరిపాలన ఇంటింటికి తెలియజేయాలి : గూడూరి ఎరిక్షన్‌బాబు



యర్రగొండపాలెం (చైతన్యరథం): తొలి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు సూచించారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సూపరిపాలనకు తొలి ఏడాది కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి పార్టీ మండల స్థాయి నాయకులు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నియోజకవర్గంలో రూ.125 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషంగా ఉందని, త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టబోతున్నామని అన్నారు. వచ్చే నాలుగేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎరిక్షన్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటింటికి వెళ్దాం... ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిద్దాం : కోటంరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): 'ఇంటింటికి వెళ్దాం... ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిద్దాం.. జనంకి అందుబాటులో ఉందాం, సంవత్సర కాలంలో మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దాం. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుందాం. పార్టీ బాగుంటే మనం బాగుంటాం. పార్టీకి, ప్రజలకు మధ్యలో వారధిగా ఉందాం.' అని నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో క్లస్టర్, కో క్లస్టర్, ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు మరియు ముఖ్య నాయకులతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నియోజకవర్గంలో ప్రారంభమవుతుందని, ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేద్దామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 100కి 100 శాతం మనం గెలిచి తీరుతామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి

**●సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్ళాలి**

**●మంత్రి గొట్టిపాటి పర్యటనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే ముత్తుముల**

గిద్దలూరు (చైతన్యరథం): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను అభివృద్ధిని ప్రజలకు తెలియచేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలుగుదేశం శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆరు మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తియిన సందర్భంగా నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమాన్ని వివరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జూలై 2వ తేదీన ప్రారంభంకానున్న ఈ కార్యక్రమంలో ప్రతీ తెలుగుదేశం కార్యకర్త పాల్గొని ప్రతిఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని తెలియచేయాలన్నారు. ప్రతీపక్ష పార్టీ చేసే తప్పుడు ప్రచారాలను కూడా తిప్పి కొట్టాలన్నారు. జూలై 4వ తదీన రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్ల, కొమరోలు, కంభం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కంభం పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు తెలుపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని మంత్రికి ఘనస్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సొసైటీ బ్యాంకు చైర్మన్లు, క్లస్టర్, యూనిట్, ఇంచార్జ్ లు, మండల నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు.



**"తప్పు చేయనప్పుడు ఎవరికీ తలవంచనవసరం లేదు. ఎంతటి కష్టాన్ని అయినా ధైర్యంగా ఎదుర్కోవచ్చు."**

**అన్నింటినీ మించిన నేరం అన్యాయంతోనూ, అక్రమంతోనూ రాజీ పడటం**

**- నేతాజీ సుభాష్ చంద్రబోస్**



# ఉదయగిరి జాబ్ మేళాకు విశేష స్పందన

**● ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో 1000 ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా 20 కంపెనీలతో ఇంటర్వ్యూలు**

ఉదయగిరి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సారథ్యంలో వింజమూరులోని శ్రీ నేతాజీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న జాబ్ మేళాకు సోమవారం విశేష స్పందన లభించింది. కళాశాలలోని మూడు ఫ్లోర్లు ఉండగా ఒక్కొక్క ఫ్లోర్‌కు ఒక కూటమి నేతను ఇన్‌ఛార్జ్‌గా నియమించి ఒక్కొక్క హెచ్ఆర్ కు ఒక వాలంటీరు ను అందుబాటులో ఉంచి సుమారు 20 తరగతి గదులలో 20 కంపెనీలతో ఇంటర్వ్యూలను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇంటర్వ్యూలు అయిన వెంటనే అక్కడకు అక్కడే నియామక పత్రములు ఇస్తున్నారు. 1000 ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఇంటర్వ్యూలు నిర్వహించబడుతున్నాయి. డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్.కె అబ్దుల్ ఖయ్యుమ్, రీజినల్ ప్లేసెమెంట్ ఆఫీసర్ కిరణ్మయి పర్యవేక్షణలో కంపెనీల హెచ్ఆర్‌లు యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. కూటమి నాయకుల నేతృత్వంలో యువతీ యువకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చి విజయవంతంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. కళాశాల యాజమాన్యం సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. కళాశాల కరస్పాండెంట్ కె.వి రత్నం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గురజాల రామ్ గోపాల్ అన్ని వసతులు సమకూర్చడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, చంద్ర మానస, మండల కన్వీనర్లు గొంగటి రఘునాథరెడ్డి, గూడా నరసారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన,సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి,పోలినేని చంద్రబాబు నాయుడు, తెలుగు యువత దాసరి అశోక్, కొమ్మి ప్రభాకర్, పూసల వెంగప నాయుడు, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, లెక్కల వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, చల్లా శ్రీనివాసులు యాదవ్, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, పాములపాటి మాల్యాద్రి, కె.శ్రీనివాసులు నాయుడు, లేట్ జయన్న, భూమిరెడ్డి హాజరత్ రెడ్డి, దొడ్డేటి పల్లి రామ్మోహన్, అంకి



పెద్దయ్య, తాళ్లూరి రమణయ్య, తాళ్లూరి మాధవ, గూడ నవీన్, భాష్యం వేరుకల నాయుడు, తిరుపతి ఆచారి, దుద్దుగుంట శ్రీనివాసులు రెడ్డి, పోరెడ్డి సునీల్, గున్నం శ్రీనివాసులు రెడ్ డిజనసేన నియోజకవర్గం కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు,వరికుంటపాడు జనసేన అధ్యక్షులు పటాన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాదిని ముంచెత్తుతున్న వర్షాలు

## - హిమాచల్‌లో కూలిన ఐదంతుస్తుల భవనం



సిమ్లా: ఉత్తరాదిని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను వర్షాలు కుదిపేస్తున్నాయి. హిమాచల్‌లోని 10 జిల్లాలకు వాతావరణ విభాగం వరద హెచ్చరికలు జారీ చేసింది. ఆ రాష్ట్ర రాజధాని సిమ్లాలో ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. ముందుజాగ్రత్త చర్యగా అందులోని నివాసితులను అధికారులు ముందే అక్కడినుంచి ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం తప్పింది. సమీపంలోని మరిన్ని భవనాలకూ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ ప్రాంతంలోని చుట్టుపక్కల ఐదు భవనాలను అధికారులు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలో మిగిలిన భవనాల భద్రతను సివిల్ ఇంజనీరింగ్ బృందం అంచనా వేస్తుంది. అనుమానాస్పదంగా ఉన్న భవంతుల్ని తదుపరి నోటీసు వచ్చే వరకు ఖాళీ చేయిస్తున్నారు.

హిమాచల్ ప్రదేశ్లో గత 24 గంటల వ్యవధిలో భారీ వర్షాలకు ముగ్గురు మృతి చెందారు. రాష్ట్రవ్యాప్తంగా 129 రహదారులు మూతపడ్డాయి. మండీ, సిర్మౌర్ జిల్లాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సోలన్‌లో ఓ వంతెన కొట్టుకుపోయింది. రెడ్ అలర్ట్ నేపథ్యంలో.. కాంగ్రా, మండీ, సోలన్, సిర్మౌర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుంచి రాష్ట్రంలో 20 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. 2023లో వర్షాకాలంలో 550 మంది ప్రాణాలు కోల్పోయారు.

***చార్ ధామ్ యాత్ర పునఃప్రారంభం***

ఉత్తరాఖండ్‌లో వరదల కారణంగా నిలిచిపోయిన చార్ ధామ్ యాత్ర సోమవారం పునఃప్రారంభమైంది. 24 గంటల నిషేధాన్ని ఎత్తేసినట్లు అధికారులు ప్రకటించారు. ఉత్తరకాశీ జిల్లాలో కుంభవృష్టి కారణంగా యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్‌లో ఆదివారం కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ కుప్పకూలింది. ఈ ఘటనలో గల్లంతైన ఏడుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. యమునోత్రి రహదారికి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

***ఆరుగురు మహిళలకు తప్పిన ప్రమాదం***

జలపాతం చూసేందుకు వెళ్లిన ఆరుగురు మహిళలకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. నీటి ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో కాలు జారి కొట్టుకుపోయిన వారంతా అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. బీహార్ రాష్ట్రం గయ జిల్లాలో గల లంగూరియా జలపాతం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, జలపాతం చూసేందుకు వెళ్లిన ఆరుగురు మహిళలు నీటిలోకి దిగారు. ఆ తరువాత కొన్ని క్షణాలకే నీటి ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో అప్రమత్తమైన మహిళలు వడివడిగా ఒడ్డుకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఇంతలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ముగ్గురు మహిళలు దిగువకు కొట్టుకుపోయారు. అయితే, అక్కడే ఉన్న స్థానికులు అప్రమత్తం కావడంతో తృటిలో వారికి పెను ప్రమాదం తప్పింది. మహిళలు జలపాతం నుంచి కిందపడే లోపే స్థానికులు వారిని ఒడ్డుకు లాగారు.

# భోపాల్ యూనియన్ కార్బైడ్ దుర్ఘటన..

## *- 337 టన్నుల వ్యర్థాల దహనం*



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో మిగిలిన వ్యర్థాలను పూర్తిగా దగ్ధం చేశారు. ఈ ఫ్యాక్టరీలో 1984 డిసెంబర్ 2న వెలువడిన విష వాయువులు కనీవినీ ఎరుగని విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. కార్బైడ్ ఫ్యాక్టరీలో మిగిలిపోయిన మొత్తం 337 టన్నుల వ్యర్థాలను ఇటీవల పీథాంపుర్ లోని ఓ డిస్పోజల్ ప్లాంట్లో పూర్తిగా దహనం చేసినట్లు మధ్యప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ద్వివేది వెల్లడించారు.

ఈ ప్లాంట్‌లో మూడు ట్రయల్స్‌లో 30 టన్నుల వ్యర్థాలను ముందు కాల్చగా.. మిగిలిన 307 టన్నులను మే 5 నుంచి జూన్ 30 మధ్య దహనం చేసినట్లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి వెల్లడించారు. మార్చి 27న హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో గంటకు గరిష్టంగా 270 కిలోల చొప్పున వ్యర్థాలను దహనం చేసినట్లు పేర్కొన్నారు. వ్యర్థాలను కాల్చుతున్న సమయంలో.. పీథాంపుర్ ప్లాంట్ నుంచి వెలువడే వివిధ రకాల వాయువులు, కణాల ఉద్గారాలను ఆన్ లైన్ యంత్రాంగం ద్వారా రియల్-టైమ్ ప్రాతిపదికన పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు దాదాపు 6 నెలల సమయం పట్టిందని వివరించారు.

ఈ వ్యర్థాల దహనం వల్ల వెలువడే వాయువులు పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు తీసుకుంటూ.. రోజుకు నిర్దేశిత పరిమాణంలోనే వ్యర్థాలను కాల్చామని ద్వివేది తెలిపారు. మొత్తం 337 టన్నుల వ్యర్థాలను దహనం చేసిన తర్వాత మిగిలిపోయిన బూడిద, ఇతర అవశేషాలను సురక్షితంగా సంచులలో ప్యాక్ చేసి కంటైనర్లలో ప్లాంట్ లీక్-ప్రూఫ్ స్టోరేజ్ షెడ్‌కు తరలించి.. భద్రపరిచినట్లు పేర్కొన్నారు. అనంతరం వాటిని భూమిలో పాతిపెట్టడానికి ప్రత్యేక నేత మాళిగలను నిర్మిస్తున్నామని, నవంబర్ నాటికి వాటి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం పనులు జరిగితే డిసెంబర్ నాటికి ఈ అవశేషాలను శుద్ధి చేసి మాళిగల్లో పాతిపెడతామన్నారు. ఈ విధంగా చేయడం వల్ల పర్యావరణానికి ఎటువంటి నష్టం వాటిల్లదని పేర్కొన్నారు.

భోపాల్లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి విష వాయువులు లీకయ్యాయి. ఆ దుర్ఘటనలో 3,787 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 5 లక్షల మంది ప్రభావితమయ్యారు. దాని బాధితులు ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి విడుదలైన మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ (ఎంఐసీ గ్యాస్) నీటిలో కలవడంతో అనేక విషవాయువులు వెలువడ్డాయని, వాటి ప్రభావం నాడు ప్రాణాలతో బయటపడిన మహిళల్లోను, పుట్టిన చిన్నారుల్లోనూ కనిపించిందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# పథకం ప్రకారమే న్యాయవిద్యార్థినిపై అత్యాచారం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్లో న్యాయ విద్యార్థినిపై అత్యాచారం కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. సౌత్ కోల్‌కతా కాలేజీలో విద్యార్థిని(24)పై ఓ పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు విద్యాసంస్థ ప్రాంగణంలోనే అత్యాచారం చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టైన ముగ్గురు నిందితులు ముందస్తు పథకం ప్రకారమే న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ముందు నుంచే విద్యార్థినులను వేధించిన చరిత్ర వారికి ఉందని వెల్లడించారు. విద్యార్థినులను వేధించి రికార్డు చేసిన దృశ్యాలతో వారిని తరచూ బ్లాక్ మెయిల్ చేసేవారని తెలిపారు. అత్యాచారానికి గురైన విద్యార్థినిని కళాశాలలో అడుగుపెట్టిన తొలి రోజే వేధించారని అన్నారు. బాధితురాలిపై అత్యాచారానికి ముందు కూడా ఆమెను లైంగికంగా వేధించి.. రికార్డు చేసిన దృశ్యాలతో బ్లాక్‌మెయిల్ చేయాలని చాలా రోజులుగా కుట్ర పన్నినట్లు తెలిపారు. దీంతో అత్యాచారానికి సంబంధించిన వీడియోలు ఫుటేజ్‌లను వేరే ఎవరికైనా పంపించి ఉంటారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ముగ్గురు నిందితుల ఫోన్లు స్వాధీనం చేసుకొని.. వారి నివాసాలలో సోదాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. స్టూడెంట్స్ యూనియన్ రూమ్, వాష్ రూమ్, గార్డ్స్ రూమ్ నుంచి ఘటనకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిపారు.

న్యాయ విద్యార్థిని అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్ర (31) కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని తెలుస్తోంది. నన్ను పెళ్లి చేసుకుంటావా" అని ప్రతి అమ్మాయితో సంభాషణను మొదలు పెట్టేవాడని నిందితుడి జూనియర్లు చెబుతున్నారు. అత్యాచారానికి గురైన యువతిని అలానే వేధించేవాడని తెలిపారు. అతడి అకృత్యాలను భరించలేక చాలామంది యువతులు కాలేజీకి రావడమే మానేసినట్లు తెలిపారు. విద్యార్థినులను ఫోటోలు తీసి వాటిని గ్రూపుల్లో పోస్టు చేసేవాడని, మార్ఫింగ్ చేసి మిత్రులకు పంపించేవాడని మోనోజిత్‌పై ఆరోపణలు వస్తున్నాయి. మహిళలపై వేధింపులు, భౌతిక దాడులు, బలవంతపు వసూళ్లు వంటి పలు ఫిర్యాదులు అతడిపై వెల్లువెత్తాయి. అతడు అధికార టీఎంసీలో పనిచేసేవాడని, ఆ పార్టీకి ఇవన్నీ తెలిసినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.

# అంతరిక్ష నిఘా మరింత బలోపేతం

## - 2029లోగా 52 మిలటరీ ఉపగ్రహాల ప్రయోగం



న్యూఢిల్లీ: అంతరిక్షంలో నిఘాను మరింత పటిష్టం చేసేందుకు కేంద్రం యోచిస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత అంతరిక్షంలో నిఘాను మరింత బలోపేతం చేసేందుకు భారత్ చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా చైనా, పాకిస్థాన్, హిందూ మహా సముద్రంపై నిఘా పెట్టేందుకు వీలుగా 52 మిలిటరీ ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించింది. రియల్ టైమ్ మానిటరింగ్ తదితర అవసరాల కోసం రూ.26,968 కోట్లను వెచ్చించనుంది. ఓ వైపు చైనా శరవేగంతో అంతరిక్షంలో ఆధిపత్యం కోసం యత్నిస్తున్న నేపథ్యంలో భారత్ ఈ చర్యలు చేపట్టింది.

స్పేస్ బేస్ సర్వైలెన్స్ (ఎస్‌బీఎస్) మూడోవిడత కార్యక్రమంలో భాగంగా.. ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్లను మూడు ప్రైవేటుసంస్థలు అభివృద్ధి చేసి కక్ష్యలోకి చేర్చనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి ఉపగ్రహాన్ని ఏప్రిల్ 2026న కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. 2029 చివరికి మొత్తం 52 ఉప గ్రహాలను అంతరిక్షంలోకి చేర్చనున్నారు.

ఇస్రో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ టెక్నాలజీని ప్రైవేటు సంస్థలకు బదలాయించి.. వాటికి ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామ్యం ఇవ్వనుంది. అత్యవసర సమయాల్లో వేగంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇది ఉపయోగపడనుంది. లోఎర్త్ జియో స్టేషనరీ కక్ష్యలపై దృష్టిపెట్టే ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ పర్యవేక్షించనున్నారు. చైనా యాంటీ శాటిలైట్ సామర్థ్యానికి కౌంటర్‌గా కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది.

ఆపరేషన్ సిందూర్ కోసం భారత్ భారీ స్థాయిలో ఉపగ్రహాలను కూడా మోహరించింది. వీటిల్లో ఇస్రో వాడుతున్న ఉపగ్రహాలతో పాటు.. అంతర్జాతీయ మద్దతు కూడా తీసుకొంది. భారత్ వద్ద ప్రస్తుతం 11 వరకూ మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఇస్రో వీటి నుంచి నిరంతరం డేటాను దళాలకు చేరవేసింది. దీంతోపాటు ఓ కమర్షియల్ గ్లోబల్ ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్ లోని ఉపగ్రహాలను కూడా రంగంలోకి దించింది. వీటి ఆధారంగా మన దళాలు పక్కా ప్లానింగ్ చేసి.. పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వాడుకొంది. ఇవి అయితే.. రోజుకు ఒకసారి అయినా చిత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను 14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది. తాజాగా చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే భారత్ చేతికి యుద్ధరంగంలోని రియల్‌టైం డేటా వేగంగా అందే అవకాశం ఉంది.

# నౌకలో అగ్ని ప్రమాదం

## సహాయక చర్యల్లో నౌకాదళం

ముంబై: భారత్ నుంచి ఒమన్‌కు వెళుతున్న ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ మేరకు సమాచారం అందుకున్న వెంటనే భారత నౌకాదళ (ఐఎన్ఎస్) సిబ్బంది రంగంలోకి దిగారు. బోట్లు, హెలికాప్టర్ సాయంతో వెంటనే నౌక వద్దకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గురైన నౌకలో భారత సంతతికి చెందిన 14 మంది సిబ్బంది ఉన్నట్లు నేవీ అధికారులు తెలిపారు. ఎంటీయీ చెంగ్ 6అనే నౌక గుజరాత్‌లోని కాండ్లా నుంచి ఒమన్‌కు బయల్దేరింది. మార్గమధ్యలో 'గల్ఫ్ ఆఫ్ ఒమన్' జలాల్లో నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంజిన్ గదిలో మంటలు చెలరేగడంతో మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది అత్యవసర సాయం కోసం సందేశం పంపారు. సమీపంలో విధుల్లో ఉన్న ఐఎన్ఎస్ తబర్.. వెంటనే అప్రమత్తమై బోట్లు, హెలికాప్టర్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది, పరికరాలను తరలించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంటలు చాలావరకు నియంత్రణలోకి వచ్చాయని భారత నౌకాదళం తెలిపింది.

ఇదిలాఉండగా.. ఇటీవల కేరళ తీరంలో ప్రమాదానికి గురైన ఓ కంటెయినర్ నౌకలోని సిబ్బందినీ భారత నౌకాదళం కాపాడిన విషయం తెలిసిందే. అంతకుముందు అరేబియా సముద్రంలో మునిగిపోయిన ఓ నౌకలోని 12 మందిని కాపాడింది. పలు సందర్భాల్లో సోమాలియా సముద్రపు దొంగల చేతిలో హైజాక్‌కు గురైన వాణిజ్య నౌకలోని సిబ్బందిని సురక్షితంగా విడిపించింది.

# కొలిక్కిరానున్న ట్రేడ్ డీల్

*భారత్ -అమెరికా మధ్య ముమ్మరంగా సంప్రదింపులు - జూలై 8కి ముందే ప్రకటన వెలువడొచ్చని అంచనా*



భారత్–అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కీలక ప్రకటన జులై 8కంటే ముందే వెలువడవచ్చని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలుపెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్ సస్పెన్షన్ జులై 9వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు ఫాక్స్ న్యూస్‌కు వెల్లడించారు. అతి త్వరలోనే టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌నుంచి చేసుకొనే దిగుమతులపై విధించిన 26 శాతం టారిఫ్‌లు జులై 9వరకు అమల్లోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10శాతం మాత్రం వర్తిస్తోంది. ఈ చర్చల సందర్భంగా భారత్ 26శాతం పన్నుపై రాయితీ కోరుతోంది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, ఆటోమొబైల్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌పైనే దృష్టిపెట్టింది. ముఖ్యంగా వ్యవసాయం, డెయిరీ రంగాల విషయంలో ఇరుదేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. భారత్ పాల ఉత్పత్తుల మార్కెట్‌ను దేశీ సంస్థల కోసం తెరిచేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు అమెరికా కొన్నిరకాల ఇండస్ట్రియల్ గూడ్సుకు, ఆటోమొబైల్ రంగంలో కన్సెషన్లను కోరుతోంది. విద్యుత్తు కార్లు, వైన్స్, పెట్రోకెమికల్స్, డెయిరీ, యాపిల్, నట్స్, జన్యుపరమైన మార్పులు చేసిన పంటల విషయంలో లబ్ధికోసం పట్టుబడుతోంది. గత శుక్రవారం ట్రంప్ మాట్లాడుతూ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే అవకాశాలున్నాయని హింట్ ఇచ్చారు. దీనిని అతి పెద్ద ఒప్పందంగా ఆయన పేర్కొన్నారు.

# ఇరాన్‌తో కటీఫ్

*వాళ్లకిచ్చేదీ లేదు.. చర్చలూ జరపలేదన్న ట్రంప్*

ఇరాన్ అణు కార్యక్రమం నుంచి బయటకు వస్తే వాషింగ్టన్ నుంచి భారీ మొత్తంలో నజరానాలు అందుతాయన్న వార్తలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి కొట్టిపారేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో స్పందిస్తూ.. "ఇరాన్‌కు నేనేమీ ఆఫర్ చేయడంలేదు. ఆ బోగస్ డెమోక్రాట్ సెనెటర్ క్రిస్ కూన్స్‌కు చెప్పండి. వారికి బిలియన్ల డాలర్లు ఇచ్చి బాంబు తయారీకి జేసీపీవోఏ ఒప్పందంలా చేయను. ఇరాన్ అణు కేంద్రాలను నాశనం చేసిన నాటినుంచి చర్చలు కూడా జరపలేదు" అని పోస్టు చేశారు. తమతో దౌత్యపరమైన చర్చలు మొదలు కావాలంటే భవిష్యత్తులో మరే దాడి చేయమని అమెరికా హామీ ఇవ్వాలని ఇరాన్ విదేశాంగశాఖ సహాయ మంత్రి మాజిద్ తక్త్ రావంచి డిమాండ్ చేశారు. చర్చలను పునరుద్ధరించాలని ట్రంప్ కార్యవర్గం మధ్యవర్తుల ద్వారా సందేశం పంపిందని బీబీసీకి ఆయన వెల్లడించారు. జూన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేపట్టిన నాటి నుంచి అమెరికా–ఇరాన్ మధ్య అణు కార్యక్రమంపై చర్చలు జరుగుతున్నాయి. ఇక టెల్ అవీవ్ దాడులకు టెహ్రాన్ క్షిపణులతో సమాధానం చెప్పింది. జూన్ 21న అమెరికానే నేరుగా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు చేసి ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగింది.

పౌర అవసరాల కోసం అణు విద్యుదుత్పత్తి చేసేందుకు టెహ్రాన్‌కు 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.5 లక్షల కోట్లు) సాయం చేసేందుకు ట్రంప్ కార్యవర్గం సిద్ధమవుతోందని సీఎన్ఎన్ వార్తా సంస్థ పేర్కొంది. దీంతోపాటు బ్యాంకుల్లో సీజ్ చేసిన ఆ సంస్థ సొమ్ములు కూడా రిలీజ్ చేయించాలని భావిస్తున్నట్టు పేర్కొంది. ఈనెల 13న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడంతో అమెరికా–ఇరాన్ మధ్య ఒమన్ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న అణుచర్చలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ అండగా అమెరికా కూడా మూడు అణుస్థావరాలపై దాడి చేయడంతో ఇప్పుడు చర్చలకు ఇరాన్ సుముఖత వ్యక్తం చేయడం లేదు. మరోవైపు ఇదంతా మీడియా తప్పుడు ప్రచారమని ట్రంప్ పేర్కొన్నారు. 30 బిలియన్ డాలర్లు ఇవ్వడమనే ఐడియానే ఎప్పుడూ వినలేదన్నారు.

## ఆఫ్ఘానీయుల తిరుగుముఖం

*టెహ్రాన్ డెడ్‌లైన్‌తో లక్షలాదిగా మాతృభూమికి...*

తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న అఫ్గానీయులపై పాకిస్థాన్ చర్యలు తీసుకుంటుండగా.. ఇరాన్ సైతం కొరడా ఝుళిపిస్తోంది. జులై 6లోగా స్వదేశానికి వెళ్లిపోవాలన్న టెహ్రాన్ ఆదేశాలతో.. లక్షలాది అఫ్గానీయులు మాతృభూమి బాటపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6.91 లక్షలమంది వెనక్కి వెళ్లినట్టు అంతర్జాతీయ వలసల సంస్థ (ఐవోఎం) తెలిపింది. ఒక్క జూన్‌లోనే 2.3 లక్షలమంది ఇరాన్‌ను వీడినట్లు వెల్లడించింది. టెహ్రాన్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఇటీవలి కాలంలో పెద్దసంఖ్యలో అఫ్గానీయులు స్వదేశానికి చేరుకుంటున్నట్టు ఐవోఎం ప్రతినిధి తెలిపారు. "జూన్ 21–28 మధ్యకాలంలో 1.31 లక్షల మంది తరలివెళ్లారు. ఆ వారం చివర్లో రోజూ 30 వేలమందికి పైగా సరిహద్దు దాటారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6.91 లక్షలమందిని ఇరాన్ సాగనంపగా.. వారిలో 70 శాతానికిపైగా బహిష్కరణకు గురైనవారే" అని వెల్లడించారు.

"ప్రాంతీయ అస్థిరత, ఇజ్రాయెల్– ఇరాన్ వివాదం పరిణామాలు, టెహ్రాన్ విధానాల్లో మార్పులవంటివి ఇటీవల కాలంలో పెద్దఎత్తున అఫ్గానీయుల బహిష్కరణకు కారణమయ్యాయి" అని అఫ్గానిస్థాన్లోని ఐరాస మిషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇప్ప టికే దుర్బల స్థితిలో ఉన్న అఫ్గాన్ మానవతా, అభివృద్ధి కార్య క్రమాలపై ఇది ప్రభావం చూపుతోందని తెలిపింది. మరోవైపు.. నిధుల కోత కారణంగా శరణార్థులకు సాయం అందించలేని పరిస్థితి ఉందని ఐవోఎం చెప్పింది. మరోవైపు.. పాకిస్థాన్ సైతం ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి జూన్ వరకు దాదాపు 5 లక్షలమందిని సాగనంపింది.

# నెలల్లోనే పుంజుకోవచ్చు!

*- ఇరాన్ అణు కార్యక్రమంపై ఐఏఈఏ*



ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలను నుజ్జునుజ్జు చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ఇది పూర్తి భిన్నంగా ఉండటం చర్చకు తావిస్తోంది. టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే అణు ఇంధన శుద్ధి చేయడాన్ని ప్రారంభించగలదన్నారు రఫేల్. ఈ వ్యాఖ్యలు దాడి అనంతరం వెలువడిన పెంటగాన్ ఇంటెలిజెన్స్ నివేదికలో ఇచ్చిన సమాచారానికి మరింత బలం చేకూర్చేలా ఉంది. "నిజం చెప్పాలంటే.. అంతా మాయమైపోయిందని, అక్కడేమీ మిగల్లేదని ఎవరూ చెప్పలేరు. అమెరికా రెండు అణుకేంద్రాలపై 14 బంకర్ బస్టర్ బాంబులు వేసింది. తీవ్రంగా నష్టం వాటిల్లింది. కానీ, పూర్తిగా నాశనమైపోలేదు" అని రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఆ రెండు కేంద్రాల్లో 18,000 సెంట్రిఫ్యూజ్లు ఉండొచ్చని గతంలో ఆయన అంచనా వేశారు. వాస్తవానికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రిపోర్టు పూర్తిగా బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించిన యురేనియం శుద్ధి కేంద్రాలపైనే ఉంది. కానీ, ఇతర గ్రూపులనుంచి వచ్చిన విశ్లేషణల ప్రకారం ఇరాన్‌కు అతి పెద్ద దెబ్బ ఇస్ఫహాన్‌లో తగిలింది. ఇక్కడ శుద్ధిచేసిన యురేనియంను లోహంగా మార్చేందుకు అవసరమైన ల్యాబ్ అమెరికా దాడిలో ధ్వంసమైంది. ఇది మాత్రం టెహ్రాన్‌కు ఇబ్బందికర విషయమే. అణ్వాయుధం తయారీకి ఈ ప్రక్రియ చాలా కీలకం. మరోవైపు ఇరాన్ ఉన్నతాధికారుల సంభాషణలను ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి విశ్లేషించాయి. వారు ఊహించినంత నష్టం వాటిల్లలేదని దీనిని బట్టి తెలుస్తోంది. ట్రంప్ మాత్రం ఇంటెలిజెన్స్ నివేదికలు లీక్‌చేసిన సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌ను కోర్టుకు లాగాలని నిర్ణయించుకొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తాము చట్ట ప్రకారం వెళ్లి.. "జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని వారికి ఎవరిచ్చారో వెల్లడించాలి" అని కోరతామన్నారు. మరోవైపు ఇరాన్ దౌత్యవేత్త అమిర్ సయిదీ ఇరావని కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ యురేనియం శుద్ధి ప్రక్రియ ఎప్పటికీ ఆగదని తేల్చిచెప్పారు. శాంతియుత అణు కార్యక్రమం కోసం ఇలా చేసే హక్కు ఇరాన్‌కు ఉందన్నారు.

# చైనా-పాక్ కొత్త కుంపటి

*- 'సార్క్'కు పోటీగా తెచ్చే ప్రయత్నం*



చైనా–పాకిస్థాన్ కలిసి దక్షిణాసియా దేశాలతో ఓ సరికొత్త గ్రూపును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా సార్క్ (సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఫర్ రీజనల్ కోపరేషన్)కు పోటీగా దీనిని తీసుకురానున్నట్టు తెలుస్తోంది. ఈమేరకు దౌత్యవేత్తలను ఉటంకిస్తూ పాక్ పత్రిక 'ది ఎక్స్ప్రెస్ ట్రిబ్యూన్' కథనం వెలువరించినట్టు పీటీఐ పేర్కొంది. ఇప్పటికే పాక్–చైనా మధ్య ఈ అంశంపై చర్చలు ముందుకెళ్లాయని వెల్లడించింది. ఈ సరికొత్త సంస్థ సార్క్ స్థానాన్ని భర్తీ చేస్తుందని పాక్ పత్రిక పేర్కొంది. ప్రస్తుతం సార్క్‌లో భారత్, అఫ్గానిస్థాన్, పాక్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక సభ్యదేశాలు. ఈ కొత్త కూటమి ఏర్పాటులో భాగంగానే ఇటీవల కున్మిన్‌లో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రతినిధులు చర్చలు జరిపారు. సార్క్‌లోని ఇతర దేశాలను కూడా కొత్త కూటమిలోకి ఆహ్వానించడాన్ని లక్ష్యంగా పెట్టుకొన్నారు. మరోవైపు ఈ ప్రచారాన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తోసిపుచ్చింది. అది రాజకీయ సమావేశం కాదని.. కొత్త అలయన్స్ ఏమీ ఏర్పడటం లేదని వెల్లడించింది. "మేము ఏ కొత్త అలయన్స్ ఏర్పాటు చేయడం లేదు" అని బంగ్లాదేశ్ విదేశాంగశాఖ సలహాదారు ఎం తౌఫిద్ హొస్సేన్ అన్నారు. ఈ సరికొత్త గ్రూపులోకి భారత్‌కు ఆహ్వానం అందవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతోపాటు మాల్దీవులు, శ్రీలంక, అఫ్గానిస్థాన్ ఇందులో భాగస్వాములయ్యే అవకాశాలున్నాయి. వాణిజ్యం, అనుసంధానతతోనే ప్రాంతీయ సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్నది ఈ గ్రూపు లక్ష్యంగా ట్రిబ్యూన్ వెల్లడించింది. ఈ కొత్త బృందం మొదలైతే.. ఇప్పటికే అచేతనంగా ఉన్న సార్క్ పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంది. 2016లో సార్క్ సదస్సు ఇస్లామాబాద్‌లో జరగాల్సిఉండగా.. ఉరిలో సైనిక శిబిరంపై ఉగ్రదాడి చోటుచేసుకొంది. దీంతో ఈ సదస్సులో పాల్గొనేందుకు భారత్ నిరాకరించింది. తర్వాత భూటాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌లు కూడా సదస్సులో పాల్గొనడానికి అనాసక్తి చూపాయి. ఇక మళ్లీ సార్క్ సదస్సు జరగలేదు.



# లలిత్ మోదీకి సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ లలిత్ మోదీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా–ఎఫ్ఈఎంఏ) నిబంధనల ఉల్లంఘన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు రూ.10.65 కోట్ల జరిమానా విధించడాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ మొత్తాన్ని బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. అయితే చట్టం ప్రకారం తనను తాను రక్షించుకునే హక్కు లలిత్ మోదీకి ఉందని న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, ఆర్.మహదేవన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

ఈ కేసులో లలిత్ మోదీ 2023 డిసెంబర్ 19న ముంబై హైకోర్టును ఆశ్రయించారు. ఆ సమయంలో తాను ఇండియన్ ప్రీమియర్ లీగ్ పాలకమండలికి చైర్మన్‌గా, బీసీసీఐ ఉపాధ్యక్షుడుగా ఉన్నానని.. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆఫీస్ బేరర్లు అధికారిక విధుల్లో ఉన్నప్పుడు సమస్య వస్తే ఆ సంస్థే వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఆయన వేసిన పిటిషన్‌లో అర్థం లేదని, ఫెమా కింద వ్యక్తిగతంగా ఆయనకు జరిమానా విధించినందున, ఆ మొత్తం బీసీసీఐ చెల్లించాల్సిన పని లేదని పేర్కొంటూ ఈ పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేసింది. రూ.లక్ష రూపాయలు జరిమానా కూడా కోర్టు విధించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బోర్డు బైలాస్ ప్రకారం బీసీసీఐ అధికారిక విధుల్లో ఉన్నప్పుడు ఆ సంస్థే వారికి నష్టపరిహారం చెల్లించాలన్న లలిత్ మోదీ వాదనను తోసిపుచ్చుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సైతం సమర్థించింది. లలిత్ మోదీ పిటిషన్‌ను కొట్టివేసింది.

కాగా ఐపీఎల్ బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని లలిత్ మోదీ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీంతో 2010లో లండన్‌కు పారిపోయిన ఆయన అప్పటినుంచి అక్కడే ఉంటున్నాడు. ఆయనను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది.

# బుమ్రాను అన్ని టెస్ట్‌ల్లో ఆడించాలి

### - దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ డివిలియర్స్




బర్మింగ్‌హామ్: టీమిండియా స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో ఐదు టెస్ట్‌ల్లోనూ ఆడించాలని భారత క్రికెట్ జట్టు మేనేజ్‌మెంట్‌కు దక్షిణాఫ్రికా మాజీ స్టార్ ఆటగాడు ఏబీ డివిలియర్స్ సూచించాడు.

భారత జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. లీడ్స్ వేదికగా ఇప్పటికే మొదటి టెస్ట్ మ్యాచ్ ముగిసింది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి చవిచూసింది. రెండో టెస్ట్ మ్యాచ్ జులై 2 నుంచి జరగనుంది. ఈ మ్యాచ్‌లో లాగైనా గెలవాలని టీమ్ ఇండియా చూస్తోంది. అయితే వర్క్ లోడ్ నేపథ్యంలో బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాడు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాను కేవలం మూడు టెస్ట్‌ల్లో మాత్రమే ఆడించాలని భారత టీవమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. టీమ్ ఇండియా తీసుకున్న ఈ నిర్ణయంపై ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డివిలియర్స్ స్పందించాడు. జస్ప్రిత్ బుమ్రా ఫార్మాట్లకు అతీతంగా ప్రపంచంలోనే అద్భుతమైన బౌలర్. అతన్ని కేవలం మూడు మ్యాచుల్లోనే ఆడించనుండటం సరైన నిర్ణయం కాదు. టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైంది. అందుకే బుమ్రాను ఈ సిరీస్లోని మొత్తం అయిదు టెస్టు మ్యాచుల్లో ఆడించాలి. వర్క్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అతడికి విశ్రాంతి ఇవ్వాలనుకుంటే అంతగా ప్రాముఖ్యం లేని టీ20, వన్డేల్లో ఆడించొద్దని డివిలియర్స్ అన్నాడు. టెస్టుల్లో మాత్రం అతడి సేవల్ని పూర్తిగా వాడుకోవాలని సూచించాడు.

సౌతాఫ్రికా టీమ్‌కు తాను కెప్టెన్‌గా ఉన్నప్పుడు పేస్ బౌలర్ డేల్ స్టెయిన్ వర్క్ లోడ్ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకున్నామని డివిలియర్స్ తెలిపాడు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి పెద్ద జట్లతో జరిగే టెస్ట్ సిరీస్‌ల్లోనే అతడ్ని ఆడించేవాళ్లమని గుర్తుచేశాడు. టీ20, వన్డే మ్యాచుల్లో స్టెయిన్‌కు రెస్ట్ ఇచ్చేవాళ్లమని తెలిపాడు. టీమిండియా కూడా బుమ్రా విషయంలో ఇలాగే వ్యవహరించాలని.. అతడ్ని సేవల్ని సమర్థంగా, జాగ్రత్తగా వాడుకోవాలని డివిలియర్స్ సూచించాడు. మరి.. జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో టీమిండియా ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

# వరుణ్ డ్రీమ్ టీమ్‌లో కోహ్లి, రోహిత్‌కు దక్కని చోటు



చెన్నై: భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ 20 డ్రీమ్ టీమ్‌లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మకు చోటు దక్కలేదు. ఈ ఏడాది జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్ ఇండియా నెగ్గడంలో వరుణ్ చక్రవర్తి కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నమెంట్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి 9 వికెట్లు పడగొట్టాడు. ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లపై దృష్టిసారించిన వరుణ్.. తాజాగా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.

టీ20 ఫార్మాట్లో ఆల్‌టైమ్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోమని చక్రవర్తిని అశ్విన్ కోరాడు. కానీ, ఇప్పటివరకు ఎవరితోనైతే కలిసి ఆడావో వారిలో నుంచే టీమ్ ఎంపిక ఉండాలని చక్రవర్తికి అశ్విన్ షరతు పెట్టాడు. ఈ డ్రీమ్ టీమ్ కోసం భారత్ నుంచి వరుణ్ ముగ్గురు ఆటగాళ్లను ఎంచుకోగా అందులో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ లేకపోవటం గమనార్హం. ఆసక్తికర విషయం ఏంటంటే వరుణ్ చక్రవర్తి 2021 టీ20 ప్రపంచకప్ సమయంలో కోహ్లి సారథ్యంలోనే ఈ ఫార్మాట్లోకి అరంగేట్రం చేశాడు. ఈ ఏడాది ఆరంభంలో రోహిత్ శర్మ కెప్టెన్సీలో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చి ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడాడు. గ్రూప్ దశలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్లో (5/42) అదరగొట్టాడు.

చక్రవర్తి తన డ్రీమ్ టీమ్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్ జోస్ బట్లర్, ఆసీస్ ప్లేయర్ ట్రావిస్ హెడ్‌లను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో, విండీస్ హిట్టర్ నికోలస్ పూరన్‌ను నాలుగో స్థానంలో తీసుకున్నాడు. వికెట్ కీపర్‌గా దక్షిణాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్, ఆల్రౌండర్లుగా హార్దిక్ పాండ్య (భారత్), ఆండ్రీ రస్సెల్ (వెస్టిండీస్)ను ఎంచుకున్నాడు. స్పిన్ కోటాలో సునీల్ నరైన్ (వెస్టిండీస్), రషీద్ ఖాన్ (అఫ్ఘానిస్థాన్), పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా (భారత్), మతీశా పతిరన(శ్రీలంక)లకు అవకాశం కల్పించాడు.

# సెంచరీతో అదరగొట్టిన డుప్లెసిస్

### ఎంసీఎల్‌లో ఎంఐ న్యూయార్క్‌పై టెక్సాస్ సూపర్‌కింగ్స్ విజయం



డాలస్: మేజర్ లీగ్ క్రికెట్ –2025 (ఎంసీఎల్)లో భాగంగా అమెరికాలోని డాలస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ 39 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్ న్యూయార్క్ (ఎంఐ న్యూయార్క్) విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 223 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ (103) సెంచరీ సాధించాడు. డోనోవన్ ఫెరీరా 53 పరుగులు చేశాడు. న్యూయార్క్ బౌలర్లలో రుషిల్ ఉగార్కర్, జార్జ్ లిండే చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

తర్వాత 224 పరుగుల విజయ లక్ష్యంతో ఛేదన ప్రారంభించించిన ఎంఐ న్యూయార్క్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. బ్యాటర్లలో పొలార్డ్ 70, క్వింటన్ డికాక్ 35 రన్స్ సాధించారు. టెక్సాస్ బౌలర్లలో అకీల్ హొసేన్ 3, నాంద్రే బర్గర్, మార్కస్ స్టోయినిస్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అకీల్ హొసేన్.. ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా నిలిచాడు. ఈ విజయంతో టెక్సాస్ జట్టు ప్లేఆఫ్స్ కు చేరుకుంది. ఆ టీమ్ వరుసగా మూడుసార్లు ఈ ఫీట్ సాధించింది.

**అదరగొట్టిన ఫాఫ్**

రిటైర్‌మెంట్ ఏజ్‌లో 40 ఏళ్ల ఫాఫ్ డుప్లెసిస్ ఈ మ్యాచ్‌లో అదరగొట్టాడు. 40 ఏళ్ల వయసులో కళ్లు, చేతి కదలికల మధ్య సమన్వయం తగ్గుతుంది. ఫిట్‌నెస్ సమస్యలు కూడా వస్తాయి. అయితే సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ ఫాఫ్ డుప్లెసిస్ మాత్రం ఆటకు వయసుతో సంబంధం లేదని నిరూపించాడు. రిటైర్ అయ్యే వయసులో పరుగుల వర్షం కురిపించి అద్భుత సెంచరీతో జట్టును గెలిపించాడు. టెక్సాస్ సూపర్ కింగ్స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న ఫాఫ్.. ఎంఐ న్యూయార్క్‌తో జరిగిన మ్యాచ్‌లో 53 బంతుల్లో 103 పరుగుల ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఇందులో 5 బౌండరీలు, 9 భారీ సిక్సులు ఉన్నాయి. 194 స్ట్రయిక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన డుప్లెసిస్.. ట్రెంట్ బౌల్ట్ సహా ప్రత్యర్థి బౌలర్లందర్నీ బాది పారేశాడు. అతడి టీ20 కెరీర్‌లో ఇది 8వ సెంచరీ కావడం విశేషం. పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్ల జాబితాలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ (8 సెంచరీలు), ఇంగ్లండ్ టాప్ బ్యాటర్ జోస్ బట్లర్ (8 సెంచరీలు)తో కలసి సంయుక్తంగా ఎనిమిదో స్థానాన్ని దక్కించుకున్నాడు డుప్లెసిస్. అదే సమయంలో మేజర్ క్రికెట్ లీగ్‌లో అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్‌గా రికార్డ్ క్రియేట్ చేశాడు. గతంలో శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్లపై శతకాలు బాదిన ఫాఫ్.. ఎంఐపై తాజా సెంచరీతో ఈ లీగ్‌లో ఎవరికీ అందనంత ఎత్తుకు చేరుకున్నాడు.



## అది గుర్తొస్తే.. ఇప్పటికీ భయమే!



గడచిన జనవరిలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడికి సంబంధించి వచ్చిన పలు వ్యాఖ్యలపై తాజా సందర్భంలో ఆయన సతీమణి, నటి కరీనా కపూర్ స్పందించారు. మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన పలు కథనాలు, విచిత్ర ప్రవర్తన తనని ఆవేదనకు గురి చేసిందన్నారు. "అదంతా పెద్ద చెత్త. ఆ వ్యాఖ్యలతో నాకు కోపం రాలేదు. బాధనిపించింది. సాటి మనిషిపై చూపించే మానవత్వమిదేనా? అనిపించింది. ఇలాంటి తప్పుడు ప్రచారాలనే ప్రజలు కోరుకుంటున్నారా? వాళ్లకు అందించే సమాచారం ఇదేనా? ఇతరుల బాధలో సంతోషం వెతుక్కుంటున్నారా? అని ఆవేదనకు గురయ్యా. మనమెంతో గొప్పగా భావించే డిజిటల్ యుగమంటే ఇదేనా? అనిపించింది" అంటూ కరీనా కపూర్ గుర్తు చేసుకున్నారు. మానవత్వాన్ని మర్చిపోకూడదని హితవు పలికారు. ఆ రోజు జరిగిన దాడి కారణంగా భయపడ్డానని, ప్రశాంతంగా నిద్రపోలేదన్నారు. "పిల్లల గదిలోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశిస్తే ఎంతో భయపడతాం. ఆ సంఘటన గుర్తొస్తే ఇప్పటికీ ఆందోళన కలుగుతుంది. ఆ ఘటన నుంచి నేనింకా పూర్తిగా బయటకు రాలేదు. సాధారణ జీవితంలోకి రాలేకపోయా"నన్నారు.

జనవరిలో సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగింది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. దుండగుడు సైఫ్ చిన్న కుమారుడు జేహ్ గదిలోకి వెళ్లాడు. దుండగుడిని చూసిన జేహ్, కేర్‌టేకర్ కేకలు వేయడంతో సైఫ్ అక్కడికి చేరుకొన్న సమయంలో పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో సైఫ్ గాయపడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడు అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడని.. దొంగతనం చేయడానికే సైఫ్ ఇంట్లోకి వెళ్లాడని తేల్చారు.

## కొడితే.. ఎల్లమ్మతో కొట్టాలి

ఏ విషయంపైనైనా ముక్కుసూటి అభిప్రాయాల చెప్పే నిర్మాత దిల్ రాజు –హీరో నితిన్ కెరియర్‌కు సంబంధించి తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. ఇండస్ట్రీలో హీరో నితిన్ కన్నా తాను ఏడాది జూనియర్నంటూనే, అనుకున్న స్థాయికి నితిన్ రాలేకపోయాడన్నారు.

శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిలారాజు నిర్మించిన తాజా చిత్రం 'తమ్ముడు'. నితిన్ హీరో, వేణుశ్రీరామ్ దర్శకుడు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీగౌడ కీలక పాత్రలు పోషించారు. మూవీ జులై 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నితిన్, దిల్ రాజుల మధ్య ఆసక్తికర ఇంటర్వ్యూ జరిగింది. "దిల్‌కీ, తమ్ముడికీ మధ్యలో నితిన్‌లో చూసిన మార్పులేంటి? ప్లస్, మైనస్‌లు రెండూ చెప్పండి" అని నితిన్ వేసిన ప్రశ్నకు.. "ఒక నటుడిగా 22 ఏళ్ల సుదీర్ఘ జర్నీ చేశావ్. నిజం చెప్పాలంటే నాకంటే ఇండస్ట్రీలో ఏడాది సీనియర్‌వి. నాకు ఎలాగైతే పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వచ్చిందో నీకూ అలాగే వచ్చింది. నీకంటే జూనియర్ని అయినా, కెరీర్‌లో ఒక్కోటి సాధించుకుంటూ టాప్‌లోకి వచ్చా. నితిన్‌ను కూడా అలాగే ఊహించుకున్నా. ఎందుకంటే 'దిల్' తీసేటప్పుడు నువ్వు.. 'ఆర్య' చేసేటప్పుడు అల్లు అర్జున్‌లు ఫ్యూచర్ హీరోలుగా ఊహించుకున్నా. కానీ, నువ్వు మాత్రం ఆ మార్కు సాధించలేకపోయావు" అని నిర్మొహమాటంగా చెప్పేశారు. వెంటనే నితిన్ అందుకుంటూ.. 'తమ్ముడి'తో పూర్వ వైభవం వస్తుందా? అని అడిగాడు. 'ఈ సినిమాతో సక్సెస్‌ఫుల్ హీరో అవుతావు. కాని, ఇది సరిపోదు. కొడితే 'ఎల్లమ్మ'తో కొట్టాలి' అని దిల్ రాజు సమాధానమిచ్చారు. 'బలగం'తో దర్శకుడిగా మారిన హాస్యనటుడు వేణు దర్శకత్వంలో 'ఎల్లమ్మ' రానుంది. ఈ మూవీని కూడా దిల్ రాజే నిర్మిస్తున్నారు.

## మనస్పర్థలు.. గాలి వార్తలే

ఒక ప్రాజెక్ట్ విషయంలో ధనుష్‌తో తనకు మనస్పర్థలు ఏర్పడ్డాయంటూ జరుగుతోన్న ప్రచారంపై ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ స్పందించారు. ఆయా కథనాలు తనను ఎంతో బాధించాయన్నారు. శింబు హీరోగా రూపొందించనున్న ఈ చిత్రాన్ని ఉద్దేశించి జరుగుతోన్న ప్రచారంపై దర్శకుడు వెట్రిమారన్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఆ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "నా తదుపరి సినిమా శింబుతో చేస్తున్నా. హీరో ధనుష్ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సూర్యతో ఇప్పటికే ప్రకటించిన 'వాడి వాసల్' పలు కారణాలతో ఆలస్యమవుతుంది. ఈ క్రమంలోనే నేను శింబుని కలిసి ఒక కథ చెప్పాను. ఆయనకు స్టోరీ ఎంతగానో నచ్చింది. వెంటనే ఓకే చెప్పారు. 'వడ చెన్నై' యూనివర్స్‌లోనే ఈ కథ ఉంటుంది. కానీ ఇది ఏమాత్రం దానికి సీక్వెల్ కాదు" అన్నారు. 'వడ చెన్నై'కు సంబంధించిన పూర్తి హక్కులు ధనుష్‌కి ఉన్నాయి. దీంతో ఆయన్ని కలిసి శింబుతో చేయనున్న సినిమా గురించి చర్చించా. ఆయన నన్ను ఒక్క రూపాయి కూడా అడగలేదు. ఎన్వోసీ ఇస్తానని చెప్పారు. ఈ విషయాలేమీ తెలియక చాలామంది మాపై తప్పుడు ప్రచా రాలు చేస్తున్నారు. అవి నాకు ఏ మాత్రం నచ్చడం లేదు. ఆన్‌లైన్‌లో జరిగే ప్రచారాలు చూస్తే ఎంతో బాధగా అనిపిస్తుంది. నా వర్క్‌లో ధనుష్ ఎప్పుడూ చేతులు పెట్టలేదు. నిజం చెప్పాలంటే, ఇటీవల నేను ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొన్నా. అలాంటి సమయంలో అడ్వాన్స్ ఇచ్చి ఆయన నాకు అండగా నిలిచారు" అని వెట్రిమారన్ అన్నారు. శింబు, ధనుష్ మధ్య మంచి అనుబంధం ఉందన్నారు. ఈ సినిమా విషయంలో వీరిద్దరూ ఎంతో ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన 'వడ చెన్నై', 'అసురన్', 'విడుదల 1, 2' చిత్రాలు తెలుగు ప్రేక్షకులనూ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.



## స్మోక్ చేయమంటే.. సినిమా వదిలేస్తా



వరుస విజయాలతో దక్షిణాది, ఉత్తరాది స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చుకున్నారు రష్మిక. 'కుబేర'తో తాజాగా మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న రష్మిక.. తాజాగా 'వి ద ఉమెన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. స్మోకింగును ఏమాత్రం ప్రోత్సహించనని స్పష్టం చేస్తూ.. ప్రాజెక్టుల ఎంపిక విషయంలోనూ కొన్ని రూల్స్ పాటిస్తానన్నారు. "వ్యక్తిగతంగా స్మోకింగ్‌ను ప్రోత్సహించను. అలాంటి సన్నివేశాల్లో నటించడానికీ ఇష్టపడను. ఇది కేవలం నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. పాత్రకు అనుగుణంగా అలాంటి సన్నివేశాల్లో నటించమని ఎవరైనా కోరితే.. సినిమా వదులుకుంటానుగానీ చేయను' అని చెప్పారు. అనంతరం 'యానిమల్'కు వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. సినిమాని సినిమాగానే చూస్తానన్నారు. "సినిమా చూసి ప్రభావితులవుతారనుకుంటే.. మీకు నచ్చిన సినిమాలు మాత్రమే చూడండి. విడుదలైన ప్రతి సినిమా చూడమని ఎవరూ ఎవరినీ బల వంతం చేయరు. అలా అయితే ప్రతి సినిమా సూపర్ హిట్ అవుతుంది. ప్రతి మనిషిలోనూ మరో కోణం ఉంటుంది. దానినే సందీప్‌రెడ్డి వంగా స్క్రీన్ మీదకు తీసుకువచ్చారు. ప్రేక్షకులు దానిని ఎంజాయ్ చేశారు. మంచి వసూళ్లు వచ్చాయి. మేము ఒక సినిమా చేశాం. అది ప్రేక్షకులకు నచ్చుతుందా? లేదా? అనేది వారి ఇష్టం. నటీనటులుగా మేము ఆయా పాత్రలను పోషిస్తున్నాం తప్ప మా వ్యక్తిగత జీవితాలకు స్క్రీన్‌పై మీరు చూసేదానికి ఎలాంటి సంబంధం లేదు" అన్నారు. నటీమణులు ఇండస్ట్రీలో విజయాన్ని అందుకోవడం సులభమే కావొచ్చని, దాన్ని నిలబెట్టుకోవడం మాత్రం అంత ఈజీ కాదన్నారు.

## స్కిన్‌గ్లో ప్రయత్నమే కారణమా?

నటి షఫాలీ జరివాలా(42) ఆకస్మిక మృతికి యాంటీ ఏజింగ్ చికిత్స కారణమన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో విచారణలో భాగంగా నటి ఇంటిని తనిఖీ చేసిన పోలీసులు రెండు బాక్సుల యాంటీ ఏజింగ్, స్కిన్ గ్లో టాబ్లెట్లను గుర్తించారు. ఆమె గత కొన్ని రోజులుగా యాంటీ ఏజింగుకు సంబంధించిన ఇంజెక్షన్లు, ఔషధాలు వాడుతున్నట్టు ప్రాథమిక నిర్ధరణకు వచ్చారు. దీనిపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్న ట్టు వెల్లడించారు. జూన్ 27 రాత్రి షఫాలీ అస్వస్థతకు గురవడంతో ఆమె భర్త పరాగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కార్డియాక్ అరెస్టుతో ఆమె మృతి చెందినట్టు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. కుటుంబసభ్యులు ధ్రువీకరించ లేదు. "శుక్రవారం రాత్రి 11.15 గంటలకు ఆమెను ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది" అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈనేపథ్యంలో ఆమె మృతికి గల కారణాలపై పలు కథనాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఖాళీ కడుపుతోనే యాంటీ ఏజింగుకు సంబంధించిన మందులు తీసుకోవడంతో కార్డియాక్ అరెస్టు సంభ వించి ఉండొచ్చని మీడి యాలో వార్తలు వస్తు న్నాయి. ఇప్పుడు పోలీసులు ఈ బాక్సులను గుర్తించడం ఆ వార్తలకు మరింత బలం చేకూరి నట్టయ్యింది.

